తిరుమలను అపవిత్రం చేసినవారిని శిక్షించాలి

నల్లజర్ల, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో లడ్డూ, తిరుమలను సైతం అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్తు మండల శాఖ అధ్యక్షుడు కందుల రవిశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం నల్లజర్ల ప్రధానకూడలిలో నిరసన తెలియజేసి స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు పాదయాత్రగా వెళ్లి వినతి పత్రం అందజేశారు. రవిశేఖర్ మాట్లాడుతూ ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డూలో జంతువుల అవశేషాలు కొవ్వు వాడడం క్షమించరాని నేరమన్నారు. ఈ విషయంలో విచారణ జరిపించి దోషులను అరెస్టు చేయాలని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి ఉప్పలపాటి మాధవరావు అన్నారు. మాయలేటి తాతారావు, వెల్లంకి రాముడు, సవలం రామకృష్ణ, చెల్లు పెదరామన్న, నందమూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న విశ్వహిందూపరిషత్తు సభ్యులు

వనం వదిలి జనారణ్యంలోకి..



- కడియం గోదావరి లంకల్లోకి చిరుత
- తాజాగా బుర్రిలంకలో అడుగుజాడలు
- గాలింపు చర్యల్లో అటవీ శాఖ



దివాన్ చెరువు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కడియం: దాదాపు పదిహేనురోజులుగా రాజమహేంద్రవరం సమీప దివాన్‌చెరువు అభయారణ్యంలో సంచరించిన చిరుత పులి తాజాగా కడియం, గోదావరి లంకల్లోకి ప్రవేశించింది. దీంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. అటవీశాఖ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రజలకు సూచనలు జారీచేస్తున్నారు.

కనిపిస్తే సమాచారం ఇవ్వండి

కడియపులంక చుట్టుపక్కల సమీప గ్రామాల్లో చిరుత ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని అటవీశాఖ అధికారులు కోరారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబరు 18004255909, అటవీశాఖ క్షేత్రాధికారి 9849156162, మానిటరింగ్ టీమ్ 9705909066 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో కొన్నాళ్లుగా తిరుగుతున్న చిరుత జాడ మూడురోజులుగా కనిపించలేదు. మంగళవారం రాత్రి కడియం మండలంలోని దోసాలమ్మ కాలనీలో ప్రత్యక్షమైంది. బుధవారం సాయంత్రం బుర్రిలంకలోని తిరుమలశెట్టి బాస్కరావు నర్సరీ నుంచి వెళ్లిపల్లి పుల్లయ్య నర్సరీ వైపు వెళ్లే మార్గంలో పాదముద్రలు గుర్తించారు. సుమారు 2 కి.మీ. మేర ప్రయాణం చేసినట్లు అటవీ అధికారులు గుర్తించారు. దివాన్‌చెరువు నుంచి కడియం వరకు నేరుగా అయితే సుమారు 13 కి.మీ, వేర్వేరు మార్గాల్లో అయితే దాదాపు 30 కి.మీ మేర ఇది పయనించి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.


చిరుతను పట్టుకునేందుకు తెచ్చిన ప్రత్యేక బోను

వరదలకు వచ్చిందా..

ఇటీవల వరదలకు గోదావరి పరీవాహక ప్రాంతాల నుంచి దివాన్‌చెరువు వైపు చిరుత వచ్చి ఉండొచ్చన్న అభిప్రాయం ఉంది. బుర్రిలంక కడియపులంక ప్రాంతాల్లో జింకలు ఉన్నందున అటువైపు వెళ్లిందేమో [illegible] ఉండవచ్చని డీఎఫ్‌వో భరణి చెబుతున్నారు. [illegible] ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా సామాజిక మాధ్యమాల్లో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిని పోలీసులకు అప్పగిస్తామని హెచ్చరించారు.

25 కెమెరాల ఏర్పాటు..

దివాన్ చెరువు అటవీ ప్రాంతంలో చిరుత ఉన్నట్లు [illegible] కి.మీ పరిధిలో వలయాకారంలో సంచరించడంతో వివిధ ప్రాంతాల్లో దాదాపు 100 ట్రాప్ కెమెరాలను అమర్చి పరిశీలిస్తూ వచ్చారు. ఇప్పుడు చిరుత దిశ మార్చడంతో కెమెరాల ఏర్పాటు విషయంలో ఓ అంచనాకు రాలేకపోతున్నారు. అది సంచరిస్తున్న ప్రాంతాల్లో 20 ట్రాప్ కెమెరాలు, 5 సీసీ కెమెరాలు బిగించారు. ఎరలు సైతం ఏర్పాటుచేశారు. కడియం నర్సరీ సంఘంతో సమావేశమై వారి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించి జాడ కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. ప్రస్తుతం 5 బృందాలు పని చేస్తున్నాయి.



కూలీల్లో ఆందోళన..

వర్షాకాలంలో మొక్కల ఎగుమతులు, దిగుమతులతో నిత్యం రద్దీగా ఉండే కడియపులంకలో ఒక్కసారిగా నిర్మానుష్యం అలుముకుంది. నర్సరీల మధ్యగా చిరుత సంచారం నేపథ్యంలో కూలీలు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా మనిషి నిల్చొని ఉంటే చిరుత దాడి చేయదని, కూర్చొని ఉంటే జంతువుగా భావించి ఎటాక్ చేసే ప్రమాదం ఉందని అధికారుల మాట. దాదాపు 4వేల ఎకరాల్లో ఉన్న నర్సరీల్లో 30 వేలమందికి పైగా కూలీలు, కార్మికులున్నారు. రెండ్రోజులుగా ఎగుమతులు నిలిచిపోయాయని వాపోతున్నారు. పులి సంచారంతో కడియపులంక, బుర్రిలంక, వేమగిరి [illegible] గ్రామాల్లోని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.


విధుల్లో అటవీ అధికారులు, సిబ్బంది

బుర్రిలంక

గత పాలకుల నిర్లక్ష్యం..

ప్రజలకు కాలుష్య గ్రహచారం

నత్తనడకన మురుగుశుద్ధి ప్లాంట్ పనులు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, టి.నగర్: కాలుష్య కోరల్లో చిక్కుకున్న గోదావరి ప్రక్షాళనకు 'నమామి గోదారి'కి శ్రీకారం చుట్టారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిధుల విడుదలలో జాప్యంతో పనులు ఆలస్యంగా ప్రారంభమై, నత్తనడకన సాగుతున్నాయి. కేంద్రం పరిపాలనామోదంతో పాటు తన వాటా నిధులు విడుదల చేసినా జగన్ ప్రభుత్వం చేసిన తీవ్ర జాప్యం ప్రజలకు శాపంగా మారుతోంది. ఎన్నికల ముందు హడావుడిగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినా పునాదుల దశ దాటలేదు.


పునాదులు దాటని ఎస్టీపీ నిర్మాణం

తొలివిడతగా రూ.100 కోట్లతో..

నమామి గోదారి ప్రాజెక్టును రూ.400 కోట్లతో చేపట్టేందుకు అంగీకరించిన కేంద్రం తొలివిడతగా రూ.100 కోట్లు విడుదలకు అంగీకరించింది. మొదట రూ.95 కోట్లతో 55 ఎంఎల్‌డీ ఎస్టీపీ నిర్మించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఉన్న 30 ఎంఎల్‌డీ ప్లాంట్ మరమ్మతులు చేస్తే రెండింటితో సమస్యను అధిగమించవచ్చని భావించారు. కేంద్రం వాటా (60 శాతం) రూ.53.06 కోట్లు విడుదల చేసిన తర్వాత చాలా కాలానికి, రాష్ట్ర వాటాగా రూ.35.37 కోట్లు విడుదల చేశారు. టెండర్లు పూర్తవ్వకుండానే గత అక్టోబర్‌లో అప్పటి పురపాలక మంత్రి ఆదిమూలపు సురేష్ హడావుడిగా శంకుస్థాపన చేశారు.

30 ఎంఎల్‌డీ ఎస్టీపీనే ఆధారం..

రాజమహేంద్రవరంలో రోజూ 60 ఎంఎల్‌డీ మురుగు ఉత్పత్తి అవుతుంది. ఆ నీరంతా నల్లా, ఆవ ఛానల్ ద్వారా నేరుగా గోదావరిలో కలుస్తోంది. ఆవ ఛానల్‌కు అనుబంధంగా 30 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ (మురుగు శుద్ధి నిర్వహణ కేంద్రం) ఉన్నా పూర్తిస్థాయిలో పని చేయట్లేదు. ఈ క్రమంలో ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ నేరుగా నదిలో కలుస్తున్నాయి. గత పుష్కరాల్లో కాలుష్య నియంత్రణ మండలి నీటి నాణ్యత పరీక్షించగా పదిరెట్లు కాలుష్యం పెరిగినట్లు గుర్తించారు. ప్లాంట్ సమీపంలో ఆవ కాలువ షట్టర్ తలుపులు పాడైపోవడంతో, అందులోంచి మురుగు వెళ్లకుండా ఒక ఇనుక చట్రానికి టార్పాలిన్ చుట్టారు.


ఆవఛానల్ షట్టర్‌కు తలుపు లేక టార్పాలిన్ చుట్టారిలా..

- నగర జనాభా: 4.50 లక్షలు
- రోజూ విడుదలవుతున్న మురుగు: 60 ఎంఎల్‌డీ
- ప్రస్తుత ఎస్టీపీ సామర్థ్యం 30 ఎంఎల్‌డీ
- నిర్మాణంలో ఎస్టీపీ సామర్థ్యం: 50 ఎంఎల్‌డీ
- 2040 నాటికి నగర జనాభా: 6.50 లక్షలు (అంచనా)
- అప్పటికి అవసరమైన ఎస్టీపీ సామర్థ్యం: 120 ఎంఎల్‌డీ

రూ.8 కోట్ల బకాయిలు..

అప్పట్లో చేసిన పనులకు సంబంధించి గుత్తేదారు తొలి విడతగా రూ.8 కోట్లకు పైగా బిల్లులు పెట్టారు. అవి మంజూరు కాకపోవడంతో పనుల్లో వేగం తగ్గింది. దీనికితోడు ఇసుక కొరత, భారీ వర్షాలు, వరదల ప్రభావం కూడా పడింది. యుద్ధ ప్రాతిపదికన ప్లాంట్ నిర్మాణం జరిగితేనే లక్ష్యం నెరవేరుతుందని, మురుగు జలాలు గోదావరిలో కలవకుండా రక్షించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. వచ్చే పుష్కరాలకు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

ఏడాదిలో పూర్తి..

నమామి గోదావరి ప్రాజెక్టులో భాగంగా ఆవ ఛానల్ వద్ద తలపెట్టిన ఎస్టీపీ ప్లాంటు 2025 ఆగస్టుకు పూర్తి చేయాలనే నిబంధన ఉంది. అది పూర్తయితే మురుగు జలాలు శుద్ధి చేసి గోదావరిలోకి మళ్లిస్తాం. తద్వారా నదీ కాలుష్యం తగ్గుతుంది.

-పాండురంగారావు, ఎస్ఈ, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

అడుగేద్దాం.. స్వచ్ఛత పాటిద్దాం

కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ ఉద్యోగులు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం కంబాలచెరువు జంక్షన్ నుంచి దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛమైన గాలి, వాతావరణం కోసం నగరవాసులు సహకరించాలన్నారు. మున్సిపల్ ఇంజినీర్లు, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ





అపచారానికి ప్రాయశ్చిత్తంగా శాంతి కల్యాణం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తిరుమలలో స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో అపచారానికి ప్రాయశ్చితంగా తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనారాయణుల శాంతి కల్యాణం బుధవారం నిర్వహించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో వేదపండితులు గోవర్ధనం చక్రవర్తి, మదనగోపాలచార్యులు నిర్వహించారు. సంఘ సభ్యుడు బొర్రా శ్రీరామ్మూర్తి దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. మహిళలు విష్ణుసహస్రనామ పారాయణ చేశారు. ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం అత్యంత బాధాకరమన్నారు. అడ్డా శ్రీరామమోహన్, గురుగుపల్లి దుర్గాప్రసాద్, పార్థసారథి, సీహెచ్.రాజా పాల్గొన్నారు.

అక్టోబరు 3 నుంచి 21 వరకు టెట్

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) అక్టోబరు 3 నుంచి 21 వరకు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు విడతలుగా నిర్వహించనున్నట్లు డీఎస్ఈఓ కె.వాసుదేవరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలు రాజమహేంద్రవరం లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రంలో నిర్వహించనున్నారన్నారు. సుమారు 8 వేల మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందని, ఇందుకోసం డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని డీఎస్ఈఓ స్పష్టం చేశారు.

జిల్లా సగటు వర్షపాతం 20.7 మి.మీ.

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): గడిచిన 24 గంటల్లో (బుధవారం ఉదయం 8.30 గంటల వరకు) జిల్లా సగటు వర్షపాతం 20.7 మి.మీ.గా నమోదైంది. రాజమహేంద్రవరం అర్బన్‌లో అత్యధికంగా 42.6 మిమీ నమోదుకాగా పెరవలి 39.2, రాజానగరం 37.4, కడియం 34.2, ఉండ్రాజవరం 32.6, రంగంపేట 31.8, రాజమహేంద్రవరం గ్రామీణం 29.2, కొవ్వూరు 28.8, తాళ్లపూడి 23.2, సీతానగరం 22.4, కోరుకొండ 17.0, నిడదవోలు 15.6, గోకవరం 15.0, బిక్కవోలు 10.2, చాగల్లు 8.4, అనపర్తి 4.8, గోపాలపురం 0.4 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.

చౌకదుకాణాల హేతుబద్ధీకరణ

నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తికి చర్యలు



అధికారుల పరిశీలన

ఆయా మండలాల్లోని ఏప చౌకదుకాణం పరిధిలో ఎన్నెన్ని కార్డులు ఉన్నాయనే దానిపై అధికారులు పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి 800 కంటే ఎక్కువ కార్డులు ఉన్న దుకాణం పరిధిలో లబ్ధిదారులకు సౌలభ్యంగా ఉండేలా ఇంకొక దుకాణాన్ని ఏర్పాటు చేయనున్నారు.

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

చౌకధరల దుకాణాల హేతుబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆయా దుకాణాలకు సమానంగా రేషన్ కార్డులు కేటాయింపు ఉండేలా చూడటంతో పాటు లబ్ధిదారులకు అందుబాటులో ఉండేవిధంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత డీలర్ల ఖాళీలను భర్తీ చేయనున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా తయారైన ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా చౌకధరల దుకాణాల హేతుబద్ధీకరణకు ఆదేశాలు జారీ చేసింది. కొన్నింటికి చాలా తక్కువ సంఖ్యలో రేషన్ కార్డుల కేటాయింపు జరగ్గా మరికొన్నింటికి ఎక్కువ కార్డులు ఉన్నట్లు గుర్తించింది. ప్రతి దుకాణానికి సమానంగా కార్డుల కేటాయింపు ఉండేలా హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు దీనిపై కసరత్తు చేస్తున్నారు.

త్వరలో డీలర్ల నియామకం

జిల్లాలో 871 రేషన్ దుకాణాలు ఉండగా వీటిలో రాజమహేంద్రవరం డివిజన్‌లో 75, కొవ్వూరు డివిజన్‌లో 53 దుకాణాలు కలిసి 128 ఖాళీగా ఉన్నాయి. వీటిని ఇప్పటివరకు ఇన్‌ఛార్జి డీలర్లతో నడిపిస్తున్నారు. కొన్నింటికి 800 కంటే తక్కువ కార్డులు ఉండగా మరికొన్నింటికి 800 దాటి 1,500 వరకు కూడా ఉన్నాయి. ఎక్కడ ఎక్కువ కార్డులు ఉన్నాయో గుర్తించి ఆ ప్రాంతంలో మరొక దుకాణం ఏర్పాటు చేసి కార్డులు సర్దుబాటు చేయనున్నారు. ఇదికాక ఇప్పటికే కొత్త కార్డుల కోసం జిల్లాలో 10 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో ప్రభుత్వం అర్హులందరికీ మంజూరు చేసే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని హేతుబద్ధీకరణ ప్రక్రియను చేపట్టనున్నారు. ఇది పూర్తయిన తర్వాత ఖాళీగా ఉన్న దుకాణాలతో పాటు కొత్తగా ఏర్పాటు చేసే వాటికి డీలర్ల భర్తీకి చర్యలు చేపట్టనున్నారు. ఎండీయూ వాహనాల ద్వారా కాకుండా గతంలో మాదిరిగా నేరుగా దుకాణం వద్దే లబ్ధిదారులకు సరకుల పంపిణీ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో చౌకదుకాణాల హేతుబద్ధీకరణ ప్రక్రియకు చర్యలు చేపట్టామని, ఈ నెలాఖరుకు దీనిని పూర్తి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో వివరాలు ఇలా..

- ప్రస్తుతమున్న రేషన్ కార్డులు: 5,74,907
- మొత్తం చౌక దుకాణాలు : 871
- ఇన్‌ఛార్జులతో నడుస్తున్నవి : 128
- 800 పైబడి కార్డులున్నవి : సుమారు 120

డీటీవోగా సురేష్ బాధ్యతల స్వీకరణ



వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): జిల్లా రవాణాధికారి(డీటీవో)గా రుద్రపాటి సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన కృష్ణారావు ఏలూరు వెళ్లారు. ఈయనతో పాటు జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో మరో ఇద్దరు అధికారులకు స్థానచలనం జరిగింది. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) రంగనాయకులు జంగారెడ్డిగూడెం బదిలీకాగా విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో జగ్గయ్యపేట నుంచి ఎం.రవికుమార్ రానున్నారు. డీటీవో కార్యాలయ పరిపాలన అధికారి(ఏవో) పెన్సిల్‌బాబు కాకినాడ బదిలీ కాగా అక్కడి నుంచి సత్తిబాబు వస్తున్నారు.

విజిలెన్స్ ఎస్పీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బదిలీ

దానవాయి పేట(రాజమహేంద్రవరం): విజిలెన్స్ ఎస్పీని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లా విజిలెన్స్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కేవీఎస్‌వీ సుబ్బారెడ్డిని రాష్ట్ర పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ప్రధాన కార్యాలయం అధికారిగా నియమించారు. ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్‌గా ఉన్న వై.శ్రీలతను ఏపీఎస్‌బీసీఎల్ వెయిటింగ్ విభాగానికి పంపగా ఏపీఎస్‌బీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఉన్న సీహెచ్ లావణ్యను ఆ స్థానంలో నియమించారు.

పొగాకు పంటకు కాసుల వర్షం

సుమారు రూ.641 కోట్ల అమ్మకాలు

వేలం కేంద్రం	పొగాకు రకం	అత్యధిక ధర	అత్యల్పం	సరాసరి
దేవరపల్లి	ఎన్ఎల్ఎస్	407	100	333.74
	బీఎల్ఎస్	407	100	282.93
గోపాలపురం	ఎన్ఎల్ఎస్	409	110	328.80

గోపాలపురం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకు పంటకు ఈ ఏడాది మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు కాసుల వర్షం కురిసింది. జిల్లా పరిధిలోని రెండు వేలం కేంద్రాల్లో గతంలో ఎన్నడూ లేని ధరలు ఈసారి లభించాయి. సుమారు 15 కంపెనీలకు చెందిన వ్యాపారులు పోటీపడి అన్ని రకాల గ్రేడ్లను రికార్డు స్థాయి ధరలకు కొనుగోలు చేశారు. దేవరపల్లి, గోపాలపురం, తాళ్లపూడి, నల్లజర్ల, సీతానగరం మండలాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. దేవరపల్లి, గోపాలపురంల్లో వేలం కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 8,566.5 హెక్టార్లలో సాగుకు అనుమతి ఇచ్చారు. 4,899 మంది రైతులు 7,760.57 హెక్టార్లలో ఎన్ఎల్ఎస్, 1,080.76 హెక్టార్లలో బీఎల్ఎస్ రకాలు పండించారు. దేవరపల్లి వేలం కేంద్రంలో రెండు రకాల కొనుగోళ్లకు అనుమతి ఇచ్చారు. 6.59 మిలియన్ కిలోల ఎన్ఎల్ఎస్, 2.17 మిలియన్ కిలోల బీఎల్ఎస్‌కు అనుమతి ఇవ్వగా అంతకు మించి 7.62 (ఎన్ఎల్ఎస్), 2.93 (బీఎల్ఎస్) మిలియన్ కిలోల చొప్పున కొనుగోళ్లు జరిగాయి. గోపాలపురంలో 9.8 మి.కి.ల ఎన్ఎల్ఎస్‌కు అనుమతి ఇవ్వగా 11.82 మి.కి.లు అమ్మారు. రెండు వేలం కేంద్రాల్లో కలిపి 19.44 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలకు సంబంధించి సుమారు రూ.641 కోట్ల వ్యాపారం జరిగింది. గతేడాది కంటే అదనంగా 3.05 మిలియన్ కిలోలు ఈ ఏడాది పండించారు.


గోపాలపురంలో వేలం కేంద్రం

అయిదు రోజులుగా అందని తాగునీరు



తాళ్లపూడిలో జాతీయ గ్రామీణ తాగునీటి పథకం నుంచి శుద్ధి చేసిన తాగునీరు అందక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అయిదు రోజుల కిందట పిడుగులు పడి రెండు మోటార్లు కాలిపోయాయి. 11 పంచాయతీల పరిధిలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అదనంగా కొత్త మోటార్లు లేకపోవడంతో మరమ్మతులు వస్తే, రోజుల తరబడి తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్త మోటార్లు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. దీనిపై ఏఈ సూర్జాన్ మాట్లాడుతూ తక్షణమే మోటార్లు బిగించి, సరఫరా చేస్తామన్నారు. ఆ ప్రాంతవాసులు గోదావరికి వెళ్లి బురద నీటినే తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

-న్యూస్‌టుడే, తాళ్లపూడి

చిరుత కదలికలపై మంత్రి ఆరా

కడియం, న్యూస్‌టుడే: కడియంలోని నర్సరీల పరిసరాల్లో చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో స్థానికులు, అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. మంగళవారం కడియం విచ్చేసిన మంత్రి అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. చిరుత పాదముద్రలు లభించిన కారణంగా ఇతరత్రా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, రక్షణ, భద్రతా ఏర్పాట్లపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చిరుత కదలికలపై ఇప్పటికే నిఘా ఉంచామన్నారు. కడియం పరిసర ప్రాంతాలను పూర్తిగా జల్లెడపడుతున్నామని, క్రూరమృగాన్ని పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలోనే పట్టుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందవద్దని, అధికారులు అండగా ఉంటారని మంత్రి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ముద్రగడ జెమీ, వెలుగుబంటి రఘురామ్, చెక్కపల్లి మురళీకృష్ణ, ఆదిమూలం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



కడియంలో అటవీ శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

శరవేగంగా ఆన్‌లైన్ ప్రక్రియ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో నిర్వీర్యమైపోయిన పంచాయతీరాజ్ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులకు కార్యాచరణ చేపట్టింది. పన్నులు వసూళ్లు ఎన్నో ఏళ్లుగానే పంచాయతీ సిబ్బంది మాన్యువల్‌గానే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమాలకు పాల్పడుతున్న పరిస్థితులు బయటపడుతున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి, పారదర్శక వసూళ్లకు డిజిటల్ చెల్లింపుల విధానాన్ని వేగవంతం చేస్తోంది. ఈ డిజిటల్ చెల్లింపుల ప్రక్రియ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం గతంలో ఆదేశించినా గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. మూడు వేల లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో చెల్లింపులకు క్యూఆర్ కోడ్, మూడు వేల దాటిన పంచాయతీల్లో ఈపోస్ యంత్రాల ద్వారా నగదు రహిత చెల్లింపులు చేయాలని హడావిడి చేశారు. కోనసీమ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలకు గాను 62 పంచాయతీల్లో మాత్రమే క్యూఆర్ కోడ్ తీసుకువచ్చారు.

పైలట్ ప్రాజెక్టుగా 6 గ్రామాల ఎంపిక..

ఉమ్మడి జిల్లాలో 1100 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో నగదు రహిత చెల్లింపుల వ్యవస్థను తీసుకువచ్చేందుకు ఆరు గ్రామ పంచాయతీలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి కార్యాచరణ చేపట్టారు. ప్రభుత్వం రూపకల్పన చేసిన apcfss వెబ్ పోర్టల్‌లో ఆయా గ్రామ పంచాయతీల వివరాలను నమోదు చేస్తున్నారు. గ్రామంలో ఉన్న గృహాలు వాటికి చెల్లించే ఆస్తి, కొళాయి పన్ను వివరాలు, దుకాణ సముదాయాలు, లేఅవుట్లు, భవన నిర్మాణాల అనుమతులు, కొబ్బరిచెట్లు, చెరువులు, ఆధార్, సర్వేనంబర్లు, సరిహద్దు వివరాలతో సహా పంచాయతీకి చెల్లించాల్సిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ప్రభుత్వ వెబ్ పోర్టల్‌లో ఆ వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ డిజిటల్ వెబ్ పోర్టల్‌లో పేమెంట్ గేట్ వే ద్వారా ప్రజలు పన్నులను చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ఇదే కాకుండా క్యూఆర్‌కోడ్, డెబిట్, క్రెడిట్ కార్డులను సైతం వినియోగించి పన్ను చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు.



అల్లవరం గ్రామ పంచాయతీలో ఆన్‌లైన్ ప్రక్రియ చేస్తున్నారిలా..

జిల్లా	మొత్తం పంచాయతీలు
ఎంపికైన గ్రామాలు	
తూర్పుగోదావరి	303
02 (దారవరం, కాపవరం)	
కాకినాడ	412
02 (దుర్గాడ, సిరివాడ)	
కోనసీమ	385
02 (అల్లవరం, అర్థమూరు)	

విడతల వారీగా అన్ని గ్రామాల్లోనూ..

పంచాయతీల్లో పారదర్శక వ్యవస్థను తీసుకువచ్చే క్రమంలో ప్రభుత్వం నగదు రహిత చెల్లింపులకు ఆన్‌లైన్ పోర్టల్ తీసుకువచ్చింది. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. విడతల వారీగా అన్ని పంచాయతీల్లోనూ అమలు చేస్తాం.

- డి.రాంబాబు, జిల్లా పంచాయతీ అధికారి

ఈపీఎఫ్‌వో 'నిధి ఆప్‌కే నికట్' రేపు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఆయా జిల్లాల్లో 'నిధి ఆప్‌కే నికట్' శిబిరాలు ఈ నెల 27న నిర్వహించనున్నట్లు సహాయ పీఎఫ్ కమిషనర్ వై.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి రాజానగరంలోని లెనోరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ వద్ద జరుగుతుందన్నారు. కోనసీమ జిల్లాకు సంబంధించి ముమ్మిడివరంలోని పీఏసీఎస్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి వై.రామవరం మండలం పి.యర్రగొండ ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల, గంగవరం మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, మారేడుమిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. ఆయా జిల్లాల పరిధిలోని పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారులతో పాటు ఎస్టాబ్లిష్‌మెంట్లు పాల్గొని ఫిర్యాదులు అందించవచ్చని, పింఛనుదారులు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించవచ్చని సహాయ పీఎఫ్ కమిషనర్ పేర్కొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం), న్యూస్‌టుడే: ఉమ్మడి గోదావరి జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు నన్నయ విశ్వవిద్యాలయం వేదికకావాలని, వనరులు, వసతులు సమకూర్చి వారిని ప్రోత్సహించాలని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన స్పోర్ట్స్ బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీ పరిధిలో 2023-24 క్రీడా పోటీలు, సాధించిన విజయాలపై వార్షిక నివేదికను డా.బి.రామ్‌గోపాల్ వివరించారు. బోర్డు కార్యక్రమాలు, పనితీరు, వివిధ క్రీడా పోటీల నిర్వహణ అంశాలపై ఫిజికల్ డైరెక్టర్లు అభిప్రాయాలు, సూచనలు వివరించారు. ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్ 2023-24 బెస్ట్ ఫిజిక్‌లో బంగారు పతకం సాధించిన కె.పవన్‌కుమార్, వెయిట్‌లిఫ్టింగ్‌లో కాంస్య పతకాలు సాధించిన ఇ.కోటేశ్వరరావు, బి.రాజేశ్వరి, బి.చంద్రిక, సీహెచ్.దినేష్, ఆలిండియా రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభచాటినవారిని వీసీ అభినందించారు. 2023-24 సంవత్సరంలో క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించిన టి.సీతాభవాని, రెహమాన్, ఎం.దీపనయోమి, పి.ధాత్రి, సీహెచ్.వినయ్‌కుమార్‌లకు అభినందనలు తెలిపారు. స్పోర్ట్స్ బోర్డు ఇన్‌ఛార్జి కార్యదర్శి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అధ్యక్షతన 2024-25 సంవత్సరంలో 28 రకాల క్రీడా పోటీలు ఏయే కళాశాలల్లో నిర్వహించాలనే అంశంపై చర్చించారు. విశ్వవిద్యాలయ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డా.కె.సుబ్బారావు, ఉమ్మడి గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల పీడీలు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య శ్రీనివాసరావు

ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించుకోండి

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం), న్యూస్‌టుడే: ఉద్యోగంలో అనుభవాన్ని, నైపుణ్యాలను యువత పెంపొందించుకోవాలని నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు సూచించారు. వర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ బుధవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఆయన మాట్లాడారు. అనలిటికల్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, తయారీ విభాగాలలో అప్రెంటీస్ ట్రైనీలుగా పనిచేయడానికి ఎంపికలు చేపట్టారని వివరించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 103 మంది అభ్యర్థినులు హాజరయ్యారని, రాత పరీక్ష, ముఖాముఖి నిర్వహించి హైదరాబాద్, విశాఖపట్నంలోని ల్యాబ్‌లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని చెప్పారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ హెచ్‌ఆర్ బి.శరణ్య మాట్లాడుతూ బీఎస్సీ మైక్రోబయోలజీ, బయోటెక్నాలజీ అర్హతలున్నవారిలో 10 మంది, ఎంఎస్సీ కెమిస్ట్రీ అర్హత లున్న 28 మందిని ఎంపికచేశామన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ బి.జగన్ మోహన్‌రెడ్డి, రెడ్డీస్ ల్యాబ్ విభాగాధిపతులు జె.వెంకట సురేష్, బి.అప్పారావు, ఎస్.అశోక్, మురుగన్, గజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు

శిరస్త్రాణం ధరించడం చోదకుల బాధ్యత

దానవాయిపేట(రాజమహేంద్రవరం): శిరస్త్రాణం ధరించడంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టాన్ని తగ్గించే అవకాశాలు ఉన్నాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం జిల్లాకోర్టు ఆవరణలోని డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణ, శిరస్త్రాణం ఆవశ్యకతపై ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడపడం ప్రమాదకరంతో పాటు చట్టరీత్యా నేరమన్నారు. అతివేగం ప్రమాదమని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. శిరస్త్రాణం అనేది తలపై బరువుగా భావించకుండా బాధ్యతగా భావించాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సమకూర్చిన శిరస్త్రాణాలను పంపిణీ చేశారు. ఈ సదస్సులో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు, డిప్యూటీ రీజనల్ హెడ్ డి.రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత తదితరులు

వరద బాధితులకు రూ.10 లక్షల సహాయం

చెక్కును అందించిన శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్

తుని, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీప్రకాష్ విద్యాసంస్థల తరపున రూ.10 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. ఈ చెక్కును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన క్యాంపు కార్యాలయంలో విద్యాసంస్థల డైరెక్టర్ చిట్టూరి విజయ్‌ప్రకాష్ మంగళవారం రాత్రి అందజేశారు. వరదల్లో తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు తమ వంతు బాధ్యతగా ఈ విరాళాన్ని ఇచ్చినట్లు విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్‌వికె నరసింహారావు తెలిపారు.



ఉప ముఖ్యమంత్రి పవన్‌కు చెక్కు అందిస్తున్న విజయ్‌ప్రకాష్

ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజల్లో నమ్మకం పెంచండి: కలెక్టర్

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూసి ప్రజల్లో నమ్మకం పెంచాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య, స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల పరిధిలో ప్రతి నెలా ఎన్ని కేసులు వస్తున్నాయనేది ఆరాతీశారు. హైరిస్కు గర్భిణుల గుర్తింపు, ఇమ్యూనైజేషన్ లక్ష్యాలను సాధించడంలో వైద్యఆరోగ్య, ఐసీడీఎస్‌ల మధ్య సమన్వయ లోపం కన్పిస్తుందన్నారు. పీహెచ్‌సీ పరిధిలో డెలివరీ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయివేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ కేసులు నెలవారీ డేటా అధ్యయనం చేయాలన్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల వారీగా గుర్తించిన వ్యాధుల వివరాలు అందజేయాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణుల విషయంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కంటి వెలుగుకు సంబంధించి సిఫార్సు చేసిన వాటి యథార్థ స్థితి, 108, 104 వాహనాలకు సంబంధించి వస్తున్న ఫోన్ కాల్స్, పట్టే సమయం, ఏఏ కేసులకు సంబంధించి సేవలు అందించారనే వాటిపై నివేదిక అందజేయాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో వసుంధర, జీజీహెచ్ సూపరింటెండెంట్ లక్ష్మీసూర్యప్రభ, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, జిల్లా ఆరోగ్యసేవా కోఆర్డినేటర్ ప్రియాంక పాల్గొన్నారు.

విమానాశ్రయ సమీపంలోని ఆక్రమణలు తొలగించాలి

కోరుకొండ, న్యూస్‌టుడే: విమానాశ్రయం నుంచి వచ్చే వరద నీరు ప్రవహించే కాలువల ఆక్రమణలు వెంటనే తొలగించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. వర్షాలు కురిసే సమయంలో విమానాశ్రయం నుంచి బయటికి వచ్చే నీటితో చుట్టుపక్కల ప్రాంతాల్లో ముంపునకు గురవుతున్న పంట భూములను బుధవారం ఆమె పరిశీలించారు. విమానాశ్రయాన్ని ఆనుకుని ఉన్న మధురపూడి, బూరుగుపూడి గ్రామాల్లో విమానాశ్రయం, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. కాలువల ఆక్రమణలపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీరు చెరువుకు చేరే కాలువ ఆక్రమణలకు గురైందని గుర్తించారు. ఇరుకుగా ఉన్న ప్రాంతాల్లోని కాలువల్లో ఆక్రమణలను తొలగించేందుకు రీసర్వే చేపట్టి నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇటీవల విమానాశ్రయానికి వచ్చిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి ఇవే సమస్యలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన పరిశీలించాలని సూచించడంతో కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.

రిలయన్స్ క్విజ్ పోటీలు డిసెంబరు 5న

శ్యామలాసెంటర్: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కేజీడీ-6 కాకినాడ ఆధ్వర్యంలో రిలయన్స్ ధీరూభాయ్ అంబాని క్విజ్ పోటీలు డిసెంబరు 5న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని, జట్టుకు ఇద్దరు చొప్పున ప్రతి పాఠశాల నుంచి రెండు జట్లు పాల్గొనవచ్చన్నారు. ఈ సదావకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ కనకరాజు, సీఎంవో శ్రీనివాసరావు, రిలయన్స్ సీఎస్ఆర్ ప్రతినిధి పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 0884-3577222లో సంప్రదించవచ్చన్నారు.

ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసం పెరగాలి: ఎస్పీ

దానవాయిపేట(రాజమహేంద్రవరం): ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసం, గౌరవం పెంపొందించేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ డి.నరసింహకిశోర్ కోరారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. సైబర్, మహిళలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాల వ్యవస్థ పటిష్టం చేయాలన్నారు. ఆర్థిక నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న, విచారణలో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పగలు, రాత్రి సమయాల్లో బీట్ విస్తరించడంతో పాటు పెట్రోలింగ్ సరైన రీతిలో జరిగేలా చూసుకోవాలన్నారు. మాదకద్రవ్యాలు, నాటుసారా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిని, మైనర్ డ్రైవింగ్ చేసే వారికి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. జిల్లాలోని వివిధ జోన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కాకినాడలో.. 6 రాష్ట్రాల ఫోరెన్సిక్ నిపుణులు

మూడు రోజుల పాటు సదస్సు

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: సౌత్ ఇండియా మెడికో లీగల్ అసోసియేషన్ (ఎస్ఐఎంఎల్ఏ) 20వ వార్షిక కాన్ఫరెన్స్-2024 కాకినాడలో నిర్వహిస్తున్నారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) ఆడిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా నుంచి సుమారు 500 మందికి పైగా ఫోరెన్సిక్ వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరుకానున్నారు. ఉత్తర భారతదేశ రాష్ట్రాల నుంచీ కొంతమంది వైద్యనిపుణులు వస్తున్నారని ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డా.నరసింహం తెలిపారు.

నేర నిర్ధారణలో ఫోరెన్సిక్ సైన్స్

నేర నిర్ధారణలో న్యాయ వ్యవస్థకు ఫోరెన్సిక్ మెడిసిన్ నిపుణులు సాంకేతికత సహకారం అందిస్తారు. ఇందులో పోస్టుమార్టం నివేదిక ప్రధానం. ఎముకల ద్వారా వయసు, లింగ నిర్ధారణ చేస్తారు. హత్య, అత్యాచారం కేసుల్లో నమూనాలను సేకరించేందుకు ఈ సైన్స్ దోహదపడుతుంది.



సదస్సు నిర్వహించే ఆర్ఎంసీ ఆడిటోరియం

నిపుణుల ప్రసంగాలు

మూడు రోజుల సదస్సులో 14 మంది ఫోరెన్సిక్, లీగల్ నిపుణులు ప్రసంగిస్తారు. ఈ విభాగంలో నూతన పోకడలు, అత్యాధునిక సాంకేతికతను వివరిస్తారు. వైద్య విద్యార్థులకు క్విజ్, సైంటిఫిక్ పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు ఉంటాయి.

ఏర్పాట్లు పూర్తి...



మొదటి రోజు నిరంతర వైద్య విద్య(సీఎంఈ) జరుగుతుంది. అతిథులుగా ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.వి.రాధికారెడ్డి, డా.జి.రఘునందన్ పాల్గొంటారు. తర్వాత రెండు రోజుల సదస్సుకు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ హాజరవుతారు. సీఎంఈ, సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం.

-డా.పి.ఉమామహేశ్వరరావు, ఎస్ఐఎంఎల్ఏ ఆర్గనైజింగ్ ఛైర్మన్

500 మందికి పైగా రాక



ఈ సదస్సును తొలిసారిగా ఆర్ఎంసీలో నిర్వహిస్తున్నాం. దక్షిణాది రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా వైద్యనిపుణులు, వైద్యవిద్యార్థులు హాజరుకానున్నారు. గురువారం స్పాట్ రిజిస్ట్రేషన్ సైతం ఉంటుంది.

-డా.ఫణికిరణ్, ఎస్ఐఎంఎల్ఏ ఆర్గనైజింగ్ కార్యదర్శి

ప్రసాదంపై వివాదాస్పద పోస్టు.. కేసు నమోదు

నల్లజర్ల, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కలిపే నెయ్యిలో ద్రవ్య కల్తీలు జరుగుతున్నాయనే ఆరోపణలపై మత ఘర్షణలు చెలరేగే విధంగా తన చరవాణిలో స్టేటస్‌గా పోస్టు పెట్టిన పుల్లలపాడులోని కనికెళ్ల శివపై కేసు నమోదు చేసినట్లు నల్లజర్ల ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు. నల్లజర్లకు చెందిన భజరంగ్‌దళ్ సభ్యుడు సవలం రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఎవరైనా వివాదాస్పదంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీ.ఐ.శ్రీనివాసరావు తెలిపారు.

ఉద్యోగి అసభ్యకర ప్రవర్తనపై ఫిర్యాదు

కొవ్వూరు పట్టణం: జలవనరుల శాఖలో ఉద్యోగి అయిన మరిది (చెల్లెలు భర్త) తమ ఇంటికి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించారని ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణ పరిధి సత్యవతినగర్‌లో సంధ్యాదేవి కుటుంబం నివసిస్తోంది. ఆమె చెల్లెలు వనజ భర్త అయిన సాధనాల కొండలరావు జలవనరుల శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కొంతకాలం క్రితం వారు విడిపోగా వనజ పిల్లలతో కాకినాడలో ఉంటున్నారు. ఈనెల 19న సాయంత్రం కొండలరావు కొవ్వూరులోని సంధ్యాదేవి ఇంటికి వచ్చి అసభ్యకరంగా మాట్లాడి చాకుతో పొడుస్తానని బెదిరించి, రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. భయపడి రూ.5 వేలు ఇవ్వగా ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపుతానని బెదిరించారు. ఈ ఘటనపై సంధ్యాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అంతర్రాష్ట్ర నేరస్థుడి అరెస్టు

400 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఒకటి కాదు.. రెండుకాదు.. ఏకంగా 44 కేసుల్లో నిందితుడు.. 14 కేసుల్లో జైలుకు వెళ్లాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జైలునుంచి విడుదలయ్యాడు. గత నెలలో భారీ చోరీచేసి తిరిగి పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర నేరస్థుడిని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా జగన్నాథపురం ఏటిమొగకి చెందిన పొన్నాడ రవిశంకర్ అలియాస్ వీరబాబు రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డులోని కోటభాస్కరమ్మనగర్‌లో నివాసముంటున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 22, విశాఖ పరిధిలో 16, తూర్పుగోదావరిలో 2, శ్రీకాకుళంలో 2, విజయనగరంలో ఒకటి, అనకాపల్లిలో ఒకటి మొత్తం 44 చోరీ కేసుల్లో నేరస్థుడు. గతనెల 26 రాత్రి కొవ్వూరు పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో మహమ్మద్ మహారాజ్ అపార్టుమెంట్‌లోని కట్టా ఉషశ్రీ ఫ్లాటులోకి చొరబడి సుమారు 400 గ్రాముల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనం చోరీ చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన సీఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు, ఎస్సైలు పి.రవీంద్రబాబు, కె.జగన్మోహనరావు రెండు బృందాలుగా కేసు దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో ఇటీవల కొవ్వూరు పట్టణంలోని నిడదవోలు బస్టాపులో నిందితుడు వీరబాబు, అతడికి సహకరించిన లంకలపల్లి నాగరాజును అరెస్టు చేశారు. చోరీ సొత్తును భీమవరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రికవరీ చేశారు. వీరబాబు చోరీచేసిన రూ.15.30 లక్షల విలువజేసే 400 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు ద్విచక్రవాహనాన్ని రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. రెండో నిందితుడైన నాగరాజు భీమవరం పట్టణంలోని పాలూరివారి వీధిలో నివాసముంటూ భీమవరం స్టేషన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్, పాలకోడేరు స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసుల్లో జైలుశిక్ష అనుభవించి గత ఏప్రిల్ నెలలో విడుదలయ్యాడన్నారు. కేసుల్లో ప్రతిభ చూపిన పలువురు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

గంజాయి తరలింపు... ఇద్దరి అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను ఏలూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2.160 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... ఏలూరు మూడో పట్టణ పోలీసు అధికారులు బుధవారం గస్తీ తిరుగుతుండగా- వారి వాహనాన్ని చూసి ఇద్దరు యువకులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువకులను తనిఖీలు చేయగా, వారి వద్ద గంజాయి లభించింది. రాజమహేంద్రవరం గోకవరానికి చెందిన బండి రాజు అలియాస్ పండు, ఆకివీడు చెందిన నక్కా మహేశ్ ఏలూరుకు గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వీరిపై గతంలోనూ కేసులు ఉన్నాయి.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,500
పాతకాయ: గండేరా	18,000
గటగట	15,000
కొత్తకాయ: గండేరా	17,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	17,000-17,500
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	3,375
కిలో	225

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికురాలి మృతి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ప్రధాన రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై మహిళా నిరీక్షణ హాలులో ఓ ప్రయాణికురాలు మృతి చెంది ఉండటాన్ని బుధవారం తెల్లవారుజామున గుర్తించినట్లు జీఆర్పీ ఎస్సై మావూళ్లు తెలిపారు. మృతురాలి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, ఆమె వద్ద హైదరాబాద్ నుంచి పుణె, కలబురగి నుంచి హైదరాబాద్‌కు ట్రైన్ టికెట్లు ఉన్నాయన్నారు. ఇతర వివరాలేవీ తెలియలేదన్నారు. రైలుకోసం నిరీక్షిస్తూ అనారోగ్య సమస్య కారణంగా మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. వివరాలు తెలిసినవారు 0883-2442821, 9491003239 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరిది చేతిలో వదిన హతం

బిక్కవోలు, న్యూస్‌టుడే: క్షణికావేశం కారణంగా మరిది చేతిలో వదిన హత్యకు గురయింది. ఈ ఘటన బలభద్రపురం పెట్రోలుబంకు వెనుక కాలనీలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ శివగణేశ్ వివరాల ప్రకారం.. బాబాయ్ గంగరాజు, అన్న కుమారుడు సునీల్ మధ్య స్వల్ప విషయమై ఘర్షణ రేగింది. ఈ ఘర్షణలో సునీల్ చొక్కా చిరిగింది. ఇంటికొచ్చిన కొడుకుని చొక్కా ఎందుకు చిరిగిందని తల్లి అడిగితే బాబాయ్ కొట్టాడని చెప్పటంతో తల్లి బుజ్జమ్మ (40) మరిదిని వివాదంపై నిలదీసింది. ఈ రెండు కుటుంబాల ఇళ్లు ఎదురెదురుగా ఉండడంతో కోపగించుకున్న మరిది ఇటుక తీసుకుని ఆమె తల మీదపై బాదాడు. ఆమె పరుగుపెట్టబోగా చీర అడ్డుకోవడంతో ముందుకు వెళ్లలేకపోయింది. ఇదే అదనుగా మరిది ఆమె తల, గుండె, ఇతర ప్రాంతాల్లో బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. వీఆర్‌వో శ్రీనివాసరావు సమాచారం మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శివగణేశ్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సి.ఐ శివగణేశ్ (అంతరచిత్రం) బుజ్జమ్మ

రాజమహేంద్రవరం

సినిమాలు: దానవాయిపేట: శ్యామల: 35 చిన్న కథ కాదు, సూర్యమినీ: ట్రాన్స్‌ఫార్మర్స్-1, శివజ్యోతి, అనుశ్రీ, రాజా, వీఎస్ మహల్: మత్తు వదలరా-2, అశోక: గొర్రె పురాణం, కుమారి: డిమోంటీ కాలనీ, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (రెండేసి ఆటలు), సూర్యప్యాలెస్: శివాజీ, స్వామి, అప్సర: సరిపోదా శనివారం, రంభ: హైడ్ అండ్ సీక్, కళింగ (రెండేసి ఆటలు), మేనక: జర్నీ, చిక్లెట్స్ (రెండేసి ఆటలు), ఊర్వశి: 100 క్రోర్స్, కమిటీ కుర్రోళ్లు(రెండేసి ఆటలు).

స్వర్ణాంధ్రపై విద్యార్థులకు పోటీలు

శ్యామలాసెంటర్: స్వర్ణాంధ్ర-2047లో భాగంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో బి.దిలీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'రాజీవ వికసిత్ ఆంధ్రప్రదేశ్‌లో తీసుకురావాల్సిన సంస్కరణలు' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించనున్నామన్నారు. 27న ఉదయం పాఠశాల, మధ్యాహ్నం స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో, 28న మండల, 29న జిల్లా స్థాయిలో నిర్వహించి విజేతలకు నగదు, ప్రశంసాపత్రాలు అందజేయడం జరుగుతుందని డీఈవో పేర్కొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులతో ఎమ్మెల్యే వాసు

ఛాంబర్ ఉపాధ్యక్ష పదవులకే పోటీ..

ముగిసిన నామపత్రాల ఉపసంహరణ ప్రక్రియ

వి.ఎల్.పురం: ప్రతిష్ఠాత్మకమైన రాజమహేంద్రవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ పాలకవర్గ ఎన్నికలకు సంబంధించిన నామపత్రాల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం రాత్రి 7 గంటలతో ముగిసింది. మొత్తం 24 స్థానాలకు గాను 25 మంది అభ్యర్థులు మిగిలారు. వీరిలో రెండు ఉపాధ్యక్ష పదవులకు ముగ్గురు పోటీలో నిలిచారు. ఉపాధ్యక్ష స్థానాలకు పోటీ పడుతున్న వారిలో వంటెద్దు సూరిబాబు, యియ్యపు మురళీధర్, దేవరెడ్డి బలరామ్‌నాయుడు ఉన్నారు. మిగతా 23 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఛాంబర్ ఎన్నిక ప్రక్రియలో భాగంగా నామినేషన్ పర్వం ఈ నెల 15న ప్రారంభమై 22వ తేదీతో ముగియగా అప్పటికే దాఖలైన 46 నామినేషన్లలో ఎనిమిది మంది ముందుగానే ఉపసంహరించుకున్నారు. 23న మరో తొమ్మిది మంది నామపత్రాలు ఉపహరించుకోగా బుధవారం మిగతా 29 మందిలో నలుగురు ఉపసంహరించుకున్నారు. తుది జాబితాను ఛాంబర్ ఎన్నికల అధికారులు రాత్రి వెల్లడించారు. ఉపాధ్యక్ష స్థానాలకు మినహా మిగతా స్థానాలన్నీ ఏకగ్రీవమయ్యాయని ఛాంబర్ ప్రధాన ఎన్నికల అధికారి జవ్వార్ తెలిపారు. ఉపసంహరణ గడువు ముగిసినప్పటికీ రెండు ఉపాధ్యక్ష స్థానాలకు పోటీ పడుతున్న వారిలో ఎవరైనా ఈ నెల 30న ఎన్నిక జరిగేలోగా ఉపసంహరించుకుంటే ఈ స్థానాలు కూడా ఏకగ్రీవమవుతాయని, లేకుంటే ఎన్నిక అనివార్యమవుతుందన్నారు. ఉపసంహరణ గడువు ముగిసినా నామినేషన్ వెనక్కి తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ డిపాజిట్ సొమ్ము మాత్రం ఆ అభ్యర్థికి తిరిగి చెల్లించడం జరగదని తెలిపారు.

ఏకగ్రీవమైన స్థానాలివే... ఛాంబర్ అధ్యక్ష స్థానానికి తవ్వా సూర్యనారాయణ మూర్తి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా గౌరవ కార్యదర్శి పదవికి ఆకుల శ్రీనివాస్, గౌరవ సంయుక్త కార్యదర్శి స్థానానికి తోట లక్ష్మీనారాయణ, కోశాధికారి స్థానానికి అల్లంకి నాగేశ్వరరావు, మూడు ట్రస్టు బోర్డు డైరెక్టర్ల స్థానాలకు గంధ్రి బ్రహ్మానందం, పచ్చిగోళ్ల సురేష్‌కుమార్, నూలి శివమల్లికార్జున ఏకగ్రీవమయ్యారు. 15 డైరెక్టర్ పదవులకు గునిశెట్టి విజయకిరణ్, భైరూలాల్ జైన్, దొండపాటి జయసింహ, మండవల్లి సత్యనారాయణమూర్తి, మునగా రమేష్, సలాది సుబ్రహ్మణ్యం, తాడి సత్యనారాయణ, యిన్నమూరి ప్రదీప్, ఉప్పులూరి బ్రహ్మాజీ, పామర్ల వీరవెంకట సత్యనారాయణమూర్తి, పులవర్తి వీరవెంకటేశ్వరరావు, కుంచ దుర్గాప్రసాద్, కొల్లేపల్లి వీర వెంకటసుభాష్, పురోహిత్ హనుమాన్‌సింగ్, కొయ్యాన కుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఛాంబర్ ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులు ఛాంబర్ కార్యాలయం వద్ద జరిపిన విజయోత్సవ సంబరాల్లో నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అసలైన ఎస్సీలకే రిజర్వేషన్లు అందేలా చూడాలి'

వి.ఎల్.పురం: మతం మార్చుకున్న దళితులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య అన్నారు. దీనిపై బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాల్లో చేరిస్తే ఆ ప్రభావం దళిత హిందూ సమాజంపై పడి వారి అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎస్సీలు పూర్తిగా వెనుకపడతారన్నారు. మతం మార్చుకున్న దళితులను ఎస్సీ జాబితా నుంచి తొలగించి అసలైన ఎస్సీలకే రిజర్వేషన్ ప్రయోజనాలు అందేట్లు చూడాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాషువా, రమేష్‌బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రపంచ పర్యాటక దినోత్సవం

స్మృతి చిహ్నాలకు పర్యాటక శోభ తేవాలి

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

రాజమహేంద్రవరం పేరు చెప్పగానే ముందుగా గుర్తుకు వచ్చేది గోదావరి పరవళ్లు. రెండోది కందుకూరి వీరేశలింగం సంస్కరణలు. అఖండ గోదావరి తీరానికి ఎనలేని ఖ్యాతిని ఆర్జించిన కందుకూరి అలనాటి కట్టుబాట్లపై ఉక్కుపాదం మోపి అలుపెరగని పోరాటం సాగించారు. ఆయన సంస్కరణల స్మృతి చిహ్నాలను పర్యాటకంగా అభివృద్ధి పరిచి భావితరాలకు పదిలంగా అందించాలని నగరవాసులు కోరుతున్నారు. ఈ నెల 27న పర్యాటక దినోత్సవం సందర్భంగా..



మెయిన్‌రోడ్డులోని పురమందిరం

ప్రారంభానికి నోచుకోని పురమందిరం

నలుగురు కలిసి కష్టసుఖాలు చర్చించాలన్నా, సాహితీ కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నా ఓ వేదిక కావాలని వీరేశలింగం భావించారు. ఫలితంగా 1880 నుంచి 1888 వరకు స్థలం కోసం అన్వేషించి మెయిన్ రోడ్డులో 1,720 గజాలు కొనుగోలు చేశారు. సొంత ఖర్చులతో భవనం నిర్మించి 1890 అక్టోబరులో అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాల సంస్కృత ఉపన్యాసకుడు ఎం.రంగాచార్యులతో ప్రారంభించారు. 1897లో ట్రస్ట్ ఏర్పాటు చేసి ధర్మకర్తలకు అప్పగించారు. నాటి నుంచి ధర్మకర్తల ఆధీనంలోనే కొనసాగుతోంది. పురమందిరం నిర్మించి వందేళ్లు పైబడటంతో శిథిలావస్థకు చేరింది. నాటి ట్రస్ట్ బోర్డు సభ్యుడు వై.ఎస్.నరసింహారావు కృషి ఫలితంగా 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వంలో సలహాదారుగా ఉన్న పరకాల ప్రభాకర్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగా పర్యాటకశాఖ నుంచి రూ.60 లక్షల నిధులు కేటాయించారు. నగరపాలక సంస్థకు బాధ్యతలు అప్పగించడంతో నాటి కమిషనర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షణలో పనులు పూర్తిచేశారు. కమిటీ సభ్యుల నిర్వహణలో ఉన్న పురమందిరంలో మరికొన్ని పనులు చేయాల్సి ఉందని చెబుతున్నారు.



వంకాయలవారి వీధిలోని జన్మగృహం



ఆనందా గార్డెన్స్‌లో కందుకూరి దంపతుల సమాధి మందిరం

ఆనందా గార్డెన్స్

కందుకూరి దంపతులు 1905లో ప్రస్తుత ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఆనందా గార్డెన్స్‌లో ప్రార్థనా మందిరం నిర్మించుకుని నివాసం ఉండేవారు. ఇక్కడ కూడా వితంతు వివాహ వేదిక నిర్మించి ఆదర్శ వివాహాలు జరిపించారు. 1910లో రాజ్యలక్ష్మి చనిపోవడంతో ఆమె సమాధి ఇక్కడే నిర్మించారు. 1919లో కందుకూరి మరణానంతరం ఆయన సమాధిని ఇక్కడే నిర్మించారు. ఇక్కడ ప్రస్తుతం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆనందా గార్డెన్స్‌లో ఆయన చేసిన సంఘ సంస్కరణ, ఇక్కడ వారు నివసించిన సమయంలో జరిపించిన వివాహ వేదిక, ప్రార్థనా మందిరం పర్యాటకంగా అభివృద్ధి చేసి భావితరాలకు పదిలంగా అందించాలి.

జన్మగృహ పరిరక్షణ అవసరం

కందుకూరి వీరేశలింగం పంతులు రాజమహేంద్రవరం వంకాయలవారి వీధిలో ఏప్రిల్ 16, 1848లో జన్మించారు. పూర్వీకుల నుంచి వస్తున్న అదే ఇంటిలో ఆయన పెరిగారు. అక్కడి నుంచే సంఘ సంస్కరణకు శ్రీకారం చుట్టారు. నాటి బ్రిటీష్ పాలకుల సహకారంతో 1881 డిసెంబరు 11న తొలి వితంతు వివాహానికి శ్రీకారం చుట్టారు. బాలికా విద్య, నాటక రచన, వివేకవర్ధిని పత్రిక ఇవన్నీ ఇదే గృహంలో నిర్వహించారు. పురావస్తుశాఖ అధీనంలో నడుస్తున్న ఈ భవనంలో కందుకూరికి సంబంధించిన రచనలు, చిత్రాలు, వాడిన వస్తువులు ఇక్కడ నిక్షిప్తం చేశారు. చాలాకాలం కిందట నిర్మించిన భవనం కావడంతో శిథిలావస్థకు చేరుతోంది.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

దేవీచౌక్, న్యూస్‌టుడే: మహిళలు సమాజంలో శక్తిమంతులుగా మారాలని మహిళాజైలు సూపరింటెండెంట్ వసంత కె.చెట్టి పిలుపునిచ్చారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో మహిళ రక్షణ కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సైబర్ నేరాలు, మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ ఛైర్మన్ బి.పద్మావతి ప్రస్తుత సమాజంలో మహిళల పాత్ర, సోషల్ మీడియాలో పాటించాల్సిన జాగ్రత్తలు, చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులకు పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ అన్నపూర్ణ, మహిళా సాధికారిత సమన్వయకర్త డాక్టర్ సురేఖ, డాక్టర్ రాజేశ్వరి, ఇతర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళాజైలు సూపరింటెండెంట్ వసంత

విజయవాడ వరద బాధితులకు విరాళం

కోటగుమ్మం, న్యూస్‌టుడే: కోటిపల్లి బస్టాండ్ వద్దగల గీత ముళ్లపూడి ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పిటల్ అధినేత కుమార్తె వేదశ్రీసాయి విజయవాడ వరద బాధితుల కోసం రూ.1.08 లక్షలు విరాళం అందజేశారు. బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేశారు. గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ముళ్లపూడి రాజేంద్రప్రసాద్, సంగీత తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న వేదశ్రీసాయి

సంక్షేమ పథకాలు అమలు చేస్తాం

టి.నగర్: సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 38, 40, 41 డివిజన్లకు సంబంధించి మూలగొయ్యి వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో నెరవేర్చడం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైకాపాకు తగిన బుద్ధి చెప్పినప్పటికీ చిల్లర రాజకీయాలు మానుకోవడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఎన్నిక

టి.నగర్: రాజమహేంద్రవరం అర్బన్ రేషన్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. బుధవారం చందా సత్రంలో జరిగిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా బత్తిని నారాయణరావు, అధ్యక్షుడిగా నమ్మి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా రాగోలు సూరిబాబు, ఉదయభాస్కర్, కె.రామచంద్రరావు, కార్యదర్శిగా కె.రమేష్, సంయుక్త కార్యదర్శిగా పి.శ్రీను, కోశాధికారిగా ఆదిరాజు ఎన్నికయ్యారు.

రెండో సెమిస్టర్ పుస్తకాల పంపిణీ

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు బుధవారం నుంచి పంపిణీ చేసినట్లు డీఈవో బి.దిలీప్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో నిల్వకేంద్రం నుంచి ప్రధానోపాధ్యాయులకు వీటిని అందజేశారు. విద్యార్థులందరికీ పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష సీఎంఓ శ్రీనివాసరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పిల్లల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పిల్లల్లో వచ్చే క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు లయన్స్‌క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో నిర్వహించారు. జేఎన్‌రోడ్డు ఏకేసీ జూనియర్ కళాశాల ఆవరణలోని రోటరీ కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ పట్నాల విశ్వనాథ్ అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగిస్తున్నపుడు వచ్చే రేడియేషన్ ప్రమాదకరమన్నారు. వ్యాయామం చేయాలని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు మద్దుల శ్రీరామగుప్తా, కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీరాజ్ అధికారికి ఎక్సలెన్స్ అవార్డు

దేవీచౌక్: జిల్లా పంచాయతీరాజ్ డివిజనల్ అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ నందిక మహాలక్ష్మికుమార్‌కు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని గవర్నర్ క్యాంపు కార్యాలయంలో ఈ నెల 19న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. మహాలక్ష్మికుమార్ 50 డిగ్రీలు పూర్తిచేసి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని ఆయన కొనియాడారు. అవార్డు పొందిన ఆయనను జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి మహ్మద్ అలీముల్లా అభినందించారు.

'ప్రజలను తప్పుదారి పట్టించేందుకే ఆరోపణలు'

వి.ఎల్.పురం: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, వాటిని అమలు చేయలేకే ప్రజలను తప్పుదారి పట్టించేందుకు తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. బుధవారం వి.ఎల్.పురంలోని వైకాపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని ఎలా నిర్ధారించారని ప్రశ్నించారు. లడ్డూ నాణ్యత పరీక్షలకు సంబంధించిన నివేదికలు తితిదే వెబ్‌సైట్‌లో పెట్టకుండా తెదేపా కార్యాలయానికి ఎందుకు వెళ్లాయని, రిపోర్టులు బయటపెట్టడానికి రెండు నెలల సమయం ఎందుకు పట్టిందన్నారు.

కత్తి చూపించి చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం నేరవార్తలు: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 22న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట ప్రాంతానికి చెందిన వరదా మణికంఠ అనే పండ్ల వ్యాపారిపై కొంతమూరులో కత్తి చూపించి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు రెండు బంగారు ఉంగరాలు, రూ.10 వేల నగదు, సెల్‌ఫోను లాక్కుని పరారైన ఘటనలో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ డి.నరసింహకిశోర్ తెలిపారు. రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆ ఘటనపై కేసు నమోదు చేసిన రాజానగరం సీఐ వీరయ్యగౌడ్.. కొంతమూరు గ్రామం జంగాల కాలనీకి చెందిన సాలా బలరామ్, అదే గ్రామంలోని రాజరాజేశ్వరిగుడి వీధికి చెందిన బాలం ఏసు అనే పాత నేరస్తులు నిందితులుగా గుర్తించారన్నారు. వీరిని అరెస్టు చేసి బంగారు ఉంగరాలు, రూ.4 వేల నగదు, సెల్‌ఫోను రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం కేసులో...

✦ ఈ నెల 12 రాత్రి బొమ్మూరు జాతీయ రహదారి కూడలి వద్ద బస్టాపు సమీపంలో ఓ వృద్ధురాలి(80)పై అత్యాచారం చేసిన కేసులో రాజవోలు గ్రామంలోని కొత్తపేటకి చెందిన జుత్తుల నాగార్జున అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. భార్యతో విడిపోయి ఒంటరిగా జీవిస్తున్న నాగార్జున మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు విచారణలో తెలిందన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణపై...

✦ మోరంపూడి వెంకటేశ్వరనగర్‌కి చెందిన చెల్లుబోయిన లక్ష్మి అనే మహిళ జులై 6న స్థానికంగా నడుచుకుంటూ వెళ్తున్న తరుణంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని 46 గ్రాముల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. కేసు నమోదు చేసిన సీఐ కాశి విశ్వనాథం సీసీ కెమెరాల ఆధారంగా కడియం మండలం జక్కంపూడినగర్‌కి చెందిన చెన్నా ప్రసాద్ అనే పాత నేరస్తుడిగా గుర్తించారు. నిందితుడ్ని అరెస్టు చేసి 46 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని గాయాలు

లలితానగర్‌కి చెందిన ఎన్.బాలజీ మంగళవారం క్వారీమార్కెట్ నుంచి లాలాచెరువు వైపుగా వెళ్తున్న తరుణంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయం కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వృద్ధుడి అదృశ్యం

వెంకటనగరం ప్రాంతానికి చెందిన టి.ముత్యాలరావు(73) ఈ నెల 19 నుంచి కనిపించడం లేదని పి.కుమారి అనే మహిళ మూడో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అర్బన్ తహసీల్దారు కార్యాలయం వద్ద..



మోరంపూడి జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులో..



కోటిపల్లి బస్టాండ్ వెనుక..



ప్రధాన రైల్వేస్టేషన్ మార్గంలో..



స్వాతంత్ర్య సమరయోధుల పార్కు సమీపంలో..

భారీ వర్షం.. రహదారులు జలమయం

వి.ఎల్.పురం, ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలో బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. జేఎన్‌రోడ్డులోని షిర్డీసాయి మార్గ్, చౌడేశ్వర్‌నగర్‌లోని పలు వీధుల్లో గంటల తరబడి నీరు నిలిచిపోయింది. నివాసితులు ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడకపోవడంతో చిన్నపాటి వర్షానికే ఇళ్లముందు నీరు నిలిచిపోతుందని చౌడేశ్వర్ నగర్ వాసులు చెబుతున్నారు. ఇక్కడ డ్రెయిన్ అభివృద్ధి చేసి సమస్య పరిష్కరించాలని గత వైకాపా ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని, కూటమి ప్రభుత్వంలోనైనా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద సర్వీసు రోడ్లపైన, ఫ్లైఓవర్‌పైనా కొంతసేపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. పైవంతెనపై కొన్ని పనులు, కింద సర్వీసు రోడ్ల అభివృద్ధి మిగిలి ఉండగానే ఇక్కడ ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఇటీవల వంతెన పైనుంచి వాహనాలను అనుమతించినప్పటికీ గట్టిగా వర్షం వస్తే నీరు నిలిచిపోయి ఇబ్బంది పడాల్సి వస్తుందని చెబుతున్నారు. మిగతా పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటే బాగుంటుందని కోరుతున్నారు. ప్రధాన రైల్వేస్టేషన్ మార్గంలోని ఆల్కాట్‌తోట ప్రాంతంలోని వీధులన్నీ చెత్త, మురుగు నీటితో నిండి స్థానికులను అవస్థలకు గురిచేశాయి.

వాగ్దానాలను గాలికి వదిలేశారు

టి.నగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసిందని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ కంచాలను గరిటెలతో కొడుతూ నిద్రపోతున్న కూటమి ప్రభుత్వాన్ని నిద్రలేపే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ఇంటింటికీ ప్రచారం చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినప్పటికీ ఏ ఒక్కటీ అమలు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళి, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, సేవాదళ్, మహిళా కాంగ్రెస్ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం ఆదర్శం

దేవీచౌక్, న్యూస్‌టుడే: జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ నిరాడంబర జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శమని వక్తలు కొనియాడారు. దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా బుధవారం కోటగుమ్మం సెంటర్‌లో భాజపా సీనియర్ నాయకుడు క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నక్కెళ్ల బాబూరావు, క్రొవ్విడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్వించదగ్గ గాయకుడు బాలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతి కార్యక్రమం రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం గోకవరం బస్టాండ్ సమీపంలోని బాలు సాంస్కృతిక మందిరంలో డాక్టర్ కంటే వీరన్నచౌదరి నిర్వహణలో బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. యర్రమోతు ధర్మరాజు, కె.ఎన్.గౌరీశంకర్, భమిడిపాటి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న వీరన్నచౌదరి తదితరులు



గుంటూరి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

✦ జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై బాలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నటుడు, గాయకుడు జిత్‌మోహన్ మిత్రా మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగిన గాయకుల్లో బాలు ఒకరన్నారు. గాయకుడు గుంటూరి శ్రీనివాస్‌ను బాల సుబ్రహ్మణ్యం పురస్కారంతో సత్కరించారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

ఆరోగ్యరంగంలో ఔషధ నిపుణుల పాత్ర కీలకం

దివాన్‌చెరువు (రాజానగరం), న్యూస్‌టుడే: ఆరోగ్య రంగంలో ఔషధ నిపుణుల పాత్ర కీలకమని దివాన్‌చెరువులోని జీఎస్‌ఎల్ ఫార్మసీ కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డా. ఎన్ వీవీ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఫార్మసిస్టులు-గ్లోబల్ హెల్త్ నీడ్స్ అంశంపై ఆయన మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. నరేంద్ర మాట్లాడుతూ ఫార్మసిస్టుల సేవలు ఆరోగ్యరంగంలో ఎంతో ప్రాముఖ్యమైనవన్నారు. కళాశాల డీన్ డా. కె. శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపల్ ఎన్. శకుంతల, హెచ్‌ఓడీలు బి. సునీల్‌కుమార్, ఎం. లక్ష్మీప్రసన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

బొమ్మూరు: వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి భీమరాజు తెలిపారు. బుధవారం శాటిలైట్ సిటీ, పిడింగొయ్యి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యాన అధికారి సుధీర్ మాట్లాడుతూ బిందు సేద్యం పథకం ద్వారా అయిదెకరాల్లోపు రైతులకు 90 శాతం రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. పశు సంవర్ధక శాఖ వైద్యుడు వెంకటరావు మాట్లాడుతూ మినీ గోకులాలు, గొర్రెలకు టీకాలు, నట్టల నివారణ మందులు ఎలా వేయాలో వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు మార్ని వాసుదేవరావు, ఏడీ శ్రీనివాస్, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నూరు శాతం ఈకేవైసీ పూర్తి చేయండి



మిల్లర్లతో మాట్లాడుతున్న జేసీ చినరాముడు

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యం త్వరలో మార్కెట్‌లోకి రానుండడం, ఇబ్బందులు లేకుండా విక్రయం చుకోవడానికి తప్పనిసరిగా ప్రతి రైతు వివరాలు సేకరించి ఈకేవైసీ చేయాలని జాయింట్ కలెక్టర్ చినరాముడు ఆదేశించారు. నూరు శాతం ఈకేవైసీ పూర్తి చేయాలని చెప్పారు. బుధవారం రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అధికారులు, సహాయకులతో మాట్లాడారు. ధాన్యం విక్రయాల్లో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే ఆ విషయాన్ని వెంటనే తెలపాలని సూచించారు. అనంతరం ఆయన మిల్లర్లతో సమావేశమయ్యారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా గోనెసంచులు ఇవ్వాలని చెప్పారు. అనంతరం పందలపాక వెళ్లి అక్కడ బాణసంచా తయారీ కొత్తగా లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న స్థలాన్ని, పరిసరాలను పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన బ్రిటీషు కాలంలో నిర్మించిన భవనాన్ని ఆసాంతం పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు రమణి తదితరులు ఉన్నారు.

ఇసుక ర్యాంపుపై వివరాల ఆరా..

కడియం: కడియం మండలంలోని బుర్రిలంక-వేమగిరి ఇసుకర్యాంపును జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు ఆర్డీవో జ్యోతితో కలిసి బుధవారం పరిశీలించారు. ర్యాంపు నిర్వహణ అనుకూల అంశాలపై ఇన్‌ఛార్జి తహసీల్దారు సునీల్‌ను వివరణ కోరారు. బాట ఏర్పాట్లు, సిబ్బంది కేటాయింపు, ఆన్‌లైన్ ప్రక్రియ అమలు అవకాశాలపై సమాచారాన్ని ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డీపట్టా భూముల పరిశీలన

కోరుకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వం 2003 సంవత్సరానికి ముందు పంపిణీ చేసిన డీపట్టా భూముల వివరాలను పరిశీలిస్తున్నామని పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఆర్. వెంకటరమణ నాయక్ చెప్పారు. కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 236 మందికి ఇచ్చిన పట్టా భూముల స్వాధీనం ఉన్నాయా, లేదా అనే విషయాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి పలు సూచనలు అందించారు.

భూసారం పెంపునకు రైతులు ముందుకురావాలి

పెదపూడి: అధిక దిగుబడులు సాధించాలంటే భూసారాన్ని పెంచాలని మండల వ్యవసాయాధికారి టి.వి.ఆర్. మణిదీప్ సూచించారు. పెదపూడి మండలం కైకవోలు, కుమారప్రియం గ్రామాల్లో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ సేవలను బలోపేతం చేయడానికి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నూతన యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు దృష్టిపెట్టాలన్నారు. భూసార పరీక్షలు సకాలంలో చేయించుకోవాలన్నారు. నారు వేసిన నాటి నుంచి పంట చేతికందే వరకు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామసింహాలతో భయం.. భయం



బుర్రిలంకలో శునకాల గుంపు మధ్య నడుస్తున్న మహిళలు

కడియం, న్యూస్‌టుడే: వీధికుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. గ్రామ సింహాల స్వైర విహారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలు గ్రామాలకు చెందినవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కడియం సీహెచ్‌సీలో రోజుకు మూడు నుంచి నాలుగు కుక్కకాటు కేసులు నమోదవుతుండడం విశేషం. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా పంచాయతీ అధికారులు మీనమేషాలు లెక్కించడంపై గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, మహిళలు శునకాలబారిన పడి బాధితులుగా మారుతున్నారు. గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలతో చిన్నారులు భయకంపితులవుతున్నారు. పాఠశాల నుంచి రావడంతో పాటు ప్రయివేటు క్లాసులకు వెళ్లడానికి వెనుకంజ వేస్తున్నారు. కోరుకొండ పంచాయతీ సిబ్బంది ఆచరించిన విధానాన్ని అవలంభించాలని కోరుతున్నారు. ఆ పంచాయతీలో ప్రత్యేకంగా విశాఖ, విజయవాడ నగరపాలక సంస్థ నుంచి సిబ్బందిని, ప్రయివేటు వ్యక్తులను రప్పించి శునకాలను పట్టిస్తున్నారని చెబుతున్నారు. సంతతి పెరిగిన గ్రామసింహాలతో ఎప్పుడే అపాయం ఎటు నుంచి ముంచుకొస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో స్వైర విహారం చేస్తున్న వీటిని పట్టుకుని అటవీ ప్రాంతాల్లో విడిచి పెట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వీధి కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు చేయిస్తున్నామని చెప్పారు. తద్వారా వీటి సంతతి తగ్గుతుందని పేర్కొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాల సందర్శన

అనపర్తి గ్రామీణం: అనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆధికారి ఎస్తర్‌రాణి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పెరటి మొక్కల పెంపకం, వృత్తి విద్యా ల్యాబ్, తరగతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

కాకినాడ ఎంపీ ఉదయ్‌కి స్వాగతం



ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న స్థానిక నేతలు

కడియం: కడియం గ్రామానికి విచ్చేసిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు బుధవారం కూటమి నాయకులు స్వాగతం పలికారు. ఎంపీగా గెలుపొందిన అనంతరం విచ్చేసిన ఆయనపై స్థానిక నేతలు పూలవర్షం కురిపించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్ పుష్పగుచ్ఛాన్ని అందించారు. సచివాలయం, పంచాయతీ అధికారులు, పలువురు రాజకీయ నేతలు పూలమాలలతో సత్కరించారు. అనంతరం కడియపుసావరం సర్పంచి చెక్కపల్లి మురళీకృష్ణ కుమార్తె వేడుకలో ఎంపీ పాల్గొన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్, ఉండమట్ల ప్రభాకర్, ఆదిమూలం సాయిబాబా, ఇసుకపట్ల బాలరాజు, నరమామిడి సాయిరామ్, సౌజన్య, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కవికొండల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభలో రైతుల ఆగ్రహం

కడియం, న్యూస్‌టుడే: కడియం విశాల పరపతి సహకార సంఘంలో బుధవారం జరిగిన మహాజన సభ రసాభాసగా ముగిసింది. ఇన్‌ఛార్జి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజనసభలో పలువురు రైతులు నిరసన గళం విప్పారు. దొడ్డిదారిన రుణాల మంజూరుపై అధికారులను నిలదీశారు. వాటిని సకాలంలో వసూలు చేయకుండా సంఘాన్ని నష్టాలబాట పట్టిస్తున్నారని ఆరోపించారు. ఫలితంగా రైతులపై తీవ్ర ప్రభావం పడి రుణాలు అందడంలేదన్నారు. రుణ ఎగవేతదారుల చిట్టాని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సంఘంలో ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో అప్పారావు, ఉపసర్పంచి వెలుగుబంటి రఘురామ్, చిలుకూరి నాగేశ్వరరావు, కడియం ఆవరైతులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కృష్ణమోహన్

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

పెదపూడి, న్యూస్‌టుడే: మండలంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు అహ్వానిస్తున్నామని కాకినాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎ. జ్యోతి బుధవారం తెలిపారు. మండలంలోని కైకవోలు ఎస్సీకాలనీ, పెదపూడి చాకలిపేట, జి.మామిడాడ శ్రీనివాసా థియేటర్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల పోస్టులు భర్తీ చేస్తామని వివరించారు. ఆసక్తి గలవారు అక్టోబరు 5వ తేదీలోగా కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

రైతు కోరిన మిల్లుకే ధాన్యం



కార్యక్రమంలో మాట్లాడున్న ఏవో శామ్యూల్ జాన్

బిక్కవోలు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో ధాన్యం విక్రయానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ఇకపై తాము కోరుకున్న మిల్లుకే ధాన్యం విక్రయించవచ్చు. ఈ విషయాన్ని బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో శామ్యూల్‌జాన్ వివరించారు. గతంలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయిస్తే ఆ ధాన్యం మిల్లులకు వెళ్లడానికి కంప్యూటర్ ద్వారా ఎంపిక చేసేవారని, దీనివల్ల 25 కి.మీ. దూరంలోని మిల్లులు కూడా వచ్చేవని చెప్పారు. అంత దూరం బస్తాలు తరలించేందుకు రైతులు ఇబ్బంది పడేవారని ఆయన గుర్తుచేశారు. ఇకపై కొనుగోలు కేంద్రానికి ధాన్యం విక్రయించిన తరవాత రైతు కోరుకున్న మిల్లుకే ధాన్యం పంపుతామని వెల్లడించారు.

'ఈనాడు' కథనానికి స్పందన

బిక్కవోలు, న్యూస్‌టుడే: తొలిరోజే అనుబంధ శాఖల డుమ్మా శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పందలపాక, తొస్సిపూడిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. అయితే శాస్త్రవేత్తలు, బ్యాంకు సిబ్బంది మాత్రం రెండో రోజు హాజరుకాలేదు.

లాభదాయక పంటలే పండించాలి

కోరుకొండ, న్యూస్‌టుడే: సమయానుకూలంగా సస్యరక్షణ విధానాలు పాటిస్తూ లాభదాయక పంటలే పండించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు అన్నారు. మండలంలోని కోటి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంట ఉత్పత్తులు లాభదాయకంగా, గిట్టుబాటు ధర వచ్చేలా, మార్కెట్‌కు అనుగుణంగా ఉండాలన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, ఏవో గౌరీదేవి, జిల్లా వనరుల కేంద్రం ఏడీ జయరామలక్ష్మి, రామతులసి తదితరులు పాల్గొన్నారు. మునగాల గ్రామంలోనూ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

లక్ష్యం దిశగా విద్యార్థులు కృషిచేయాలి

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధన దిశగా కృషిచేయాలని ఆదాయ పన్ను శాఖ విశ్రాంత కమిషనర్ మేడిశెట్టి తిరుమల సూచించారు. స్థానిక శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మూరు సెంటీనియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఎంపవర్మెంట్ కార్యక్రమంలో భాగంగా లక్ష్యాన్ని చేరుకోవడం ఎలా అనే అంశంపై ఆయన మాట్లాడారు. యువత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ప్రణాళికతో చదువుకుంటే విజయం సాధించగలరన్నారు. కార్యక్రమంలో కె. రమేష్‌బాబు, రామారావు, శ్రీరాములు, హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు డి. రాముడు, బి. హరిప్రసాద్ పాల్గొన్నారు.

చెకుముకి పరీక్ష

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరంలో బుధవారం నిర్వహించిన చెకుముకి పరీక్షకు 527 మంది బాలబాలికలు హాజరైనట్లు కన్వీనర్ కన్నూరి సతీష్ బాబు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీ నిర్వహించామన్నారు. వీరిలో అర్హత సాధించినవారికి అక్టోబరు ఒకటో తేదీన మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని వివరించారు.



వెంకన్న సన్నిధిలో కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

కల్తీ నెయ్యి కారకులను శిక్షించాలి

గోకవరం, న్యూస్‌టుడే: తితిదేలో శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలంటూ కూటమి నాయకులు డిమాండ్ చేశారు. లడ్డూ తయారీ ద్రవ్య కలుషిత దోష పరిహారార్థం తంటికొండ గ్రామంలో వెంకటగిరిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మాజీ ఛైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, సువర్ణ తులసి దంపతులు కర్తలుగా వ్యవహరించి స్వామివారి సన్నిధిలో పూజలు, అభిషేకాల చేశారు. ప్రాంగణంలో నాయకులు 108 కొబ్బరికాయలను కొట్టారు. నాయకులు మంగరౌతు రాము, దాసరి సీతారామ్, బద్దిరెడ్డి బాబీ, భీశెట్టి వెంకన్న, మలిరెడ్డి సిరి, గెడ్డంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి గట్టుపై వ్యర్థాల గుట్టలు

ధవళేశ్వరంలోని పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారం కావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. తాజాగా ఇటీవల ఓ సమావేశంలో ఇదే అంశంపై పంచాయతీ అధికారులపై ఎమ్మెల్యే గోరంట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ పరిసరాల్లో చేపల వ్యర్థాలను కాలువలోకి నెట్టుతున్నారు. దీంతో తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని సందర్శకులతోపాటు వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. తాజాగా స్థానిక సాయిబాబా ఆలయం సమీపంలోని గోదావరి గట్టు వ్యర్థాలకు నిలయంగా మారింది. ఈ వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో వెనుక ఉన్న పచ్చని చెట్లు కాలిబూడిదవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాసరావును వివరణ కోరగా సమస్య పరిష్కారానికి పంచాయతీ సిబ్బందికి సూచనలు జారీ చేశామన్నారు. దాంతోపాటు ఆ ప్రాంతంలో హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, ధవళేశ్వరం (కడియం)



మైదానంలో తుప్పలు.. క్రీడలకు తిప్పలు

సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారుగా 500 మందికి పైబడి విద్యార్థులు ఉన్నారు. వీరితోపాటు వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఈ పాఠశాలలో ఉన్న మైదానంలోనే ఉదయం, సాయంత్రం వ్యాయామం, ఆటలు ఆడుతుంటారు. ఈ మైదానంలో కంపచెట్లు పెరిగిపోయి విషసర్పాలు తిరుగుతుండటంతో క్రీడలకు దూరమవుతామని వీరు వాపోతున్నారు. పైగా మండల స్థాయిలో నిర్వహించే పలు పోటీలకు ఈ మైదానమే వేదిక కావడం విశేషం. గతంలో ఇదే మైదానంలో ఎంతోమంది క్రీడాకారులు సాధన చేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించారు. దీనిని బాగుచేయించాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సీతానగరం



నాణ్యమైన ఉత్పత్తులు అందించడమే లక్ష్యం

కోరుకొండ, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించేందుకు కృషిచేస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు పేర్కొన్నారు. కోరుకొండలోని వ్యవసాయ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత ప్రమాణాల పరీక్షలపై ఆయన సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని ల్యాబ్‌ల్లోనూ ఇదే ప్రక్రియ అమలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏడీ మల్లికార్జునరావు, ల్యాబ్ ఏవో రామతులసి, ఏరువాక కేంద్రం ఏడీ డాక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పలు కేసుల్లో నిందితుల అరెస్టు

రాజమహేంద్రవరం నేరవార్తలు: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 22న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట ప్రాంతానికి చెందిన వరదా మణికంఠ అనే పండ్ల వ్యాపారిపై కొంతమూరులో కత్తి చూపించి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు రెండు బంగారు ఉంగరాలు, రూ.10 వేల నగదు, సెల్‌ఫోను లాక్కుని పరారైన ఘటనలో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ డి. నరసింహకిశోర్ తెలిపారు. రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆ ఘటనపై కేసు నమోదు చేసిన రాజానగరం సీఐ వీరయ్యగౌడ్.. కొంతమూరు గ్రామం జంగాల కాలనీకి చెందిన సాలా బలరామ్, అదే గ్రామంలోని రాజరాజేశ్వరిగుడి వీధికి చెందిన బాలం ఏసు అనే పాత నేరస్థులు నిందితులుగా గుర్తించారన్నారు. వీరిని అరెస్టు చేసి బంగారు ఉంగరాలు, రూ.4 వేల నగదు, సెల్‌ఫోను రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

● ఈ నెల 12 రాత్రి బొమ్మూరు జాతీయ రహదారి కూడలి వద్ద బస్టాండు సమీపంలో ఓ వృద్ధురాలి(80)పై అత్యాచారం చేసిన కేసులో రాజవోలు గ్రామంలోని కొత్తపేటకి చెందిన జుత్తుల నాగార్జున అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. భార్యతో విడిపోయి ఒంటరిగా జీవిస్తున్న నాగార్జున మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు విచారణలో తెలిందన్నారు.

● మోరంపూడి వెంకటేశ్వరనగర్‌కి చెందిన చెల్లుబోయిన లక్ష్మి అనే మహిళ జులై 6న స్థానికంగా నడుచుకుంటూ వెళ్తున్న తరుణంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని 46 గ్రాముల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. కేసు నమోదు చేసిన సీఐ కాశీ విశ్వనాథం సీసీ కెమెరాల ఆధారంగా కడియం మండలం జక్కంపూడినగర్‌కి చెందిన చెన్నా ప్రసాద్ అనే పాత నేరస్థుడిగా గుర్తించారు. నిందితుడ్ని అరెస్టు చేసి 46 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎప్పీ తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు అయిన పాకలపాటి సునీల్ వర్మ, C/o. పాకలపాటి భాస్కర రాజు (తండ్రి) కొంతమూరు, తూర్పుగోదావరి జిల్లా వారు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి తూర్పుగోదావరి జిల్లా, రంగంపేట మండలం, వడిశలేరు గ్రామం, డోర్ నెం. 8-37/2 రు కాపురస్తులు పాల శివరామకృష్ణ గారి కుమారుడు పాల రామస్వామి గార్లకు చెందిన ఈ క్రింది షెడ్యూలు ఆస్తి గల దస్తావేజు నెం. 7507/2019, Dt. 28-11-2019, SRO, రాజానగరం సంబంధించిన స్థిరాస్తిని వారి సంపూర్ణ హక్కు భుక్తములు కలిగి ఆస్తి అయి ఉన్నది. అందువలన మా క్లయింటు క్రయ అగ్రిమెంటు వ్రాయించుకొనియున్నారు.

కావున ఈక్రింది తెలిపిన ఆస్తులపై తనఖాలు గాని, కోర్టు కేసులు గాని, వారసత్వపు హక్కులు గాని, బ్యాంకు లోనులు గాని మరియు ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల 7 రోజులలో వారి అభ్యంతరములను వ్రాతపూర్వకంగా తగిన ఆధారముల కాపీలతో ఈక్రింది అడ్రస్‌కి తెలియజేయవలెను. గడువు తేది తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును మరియు ఆస్తిని బైండు చేయవని, గడువు తేదీలోపు ఏవిధమైన అభ్యంతరములు రాని యెడల నా క్లయింటు పైన తెలిపిన ఆస్తిని నిర్వివాద నిష్పేచీ ఆస్తి అని నా క్లయింటు కొనుగోలు చేయుదురని తెలియజేయడమైనది.

ఆస్తి షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, కోరుకొండ మండలం, కోరుకొండ సబ్ రిజిస్ట్రారులో చేరిన, గాదరాడ పంచాయతి బోర్డుకు చెందిన గాదరాడ గ్రామం తాలూకు జిరాయితీ మెరక రి.స. నెం. 46/1రు పూరా య. 5.70ట్లులో దక్షిణం వైపు య. 2.85 ట్లు లేక 1.154 హెక్టార్ల భూమికి హద్దులు.

తూర్పు: కోన లక్ష్మణరావు వగైరాల భూమి. దక్షిణం: కోన లక్ష్మణరావు వగైరాల భూమి. పడమర: కణుపూరు వెళ్ళే రోడ్డు. ఉత్తరం: కర్రి అప్పారావు గారి యీ నెంబరులో భూమి.

సదరు హద్దుల మధ్యస్థమైన య. 2.85ట్లు భూమిన్నీ, అందలి నానా తరు జల నిధి నిక్షేపములు, మామూలు మార్గములు, మామూలు నీటి మార్గములు అందలి సమస్త యీజిమెంటు హక్కులతో సహా.

దాసరి సంజయ్‌గుప్త, అడ్వకేట్
రాజమండ్రి మెయిన్‌రోడ్, రాజమండ్రి
25-9-2024 సెల్: 9301473714

తండ్రి మృతదేహాన్ని గుర్తించిన కుమార్తె

కైకలూరు, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా కైకలూరు మండలం వింజరం పంట కాలువలో ఈనెల 21న గుర్తు తెలియని మృతదేహం లభ్యమవడంతో పట్టణ పోలీసులు కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దినపత్రికల్లో వార్తలను చూసిన తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన జ్యోతిర్మయి పోలీసులను ఆశ్రయించారు. మృతదేహాన్ని చూసి తన తండ్రి నక్కిన నాగభూషణం (47)గా గుర్తించినట్లు సీఐ పి. కృష్ణ తెలిపారు. ఈనెల ఒకటో తేదీన నాగభూషణం తెలంగాణ రాష్ట్రంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. వరదలు వచ్చిన సమయంలో స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మహబూబాబాద్‌లోని రాళ్లవాగు దాటుతూ ప్రవాహానికి వాగులో కొట్టుకుపోయారు. ఈనేపథ్యంలో రాళ్లవాగు నుంచి మున్నేరువాగు, కృష్ణానది మీదుగా వింజరం లాకుల వద్దకు మృతదేహం కొట్టుకొచ్చింది. మృతుడి కుమార్తె చెప్పిన ఆధారాల ప్రకారం గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

సారా స్వాధీనం

రాజమహేంద్రవరం నేరవార్తలు: హుకుంపేట ప్రాంతానికి చెందిన ఎన్. శరత్‌బాబు నామవరంలో సారా విక్రయిస్తుండగా బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద ఉన్న 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని గాయాలు

లలితానగర్‌కి చెందిన ఎన్. బాలజీ మంగళవారం క్వారీమార్కెట్ నుంచి లాలాచెరువు వైపుగా వెళ్తున్న తరుణంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయం కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వృద్ధుడి అదృశ్యం

వెంకటనగరం ప్రాంతానికి చెందిన టి. ముత్యాలరావు(73) ఈ నెల 19 నుంచి కనిపించడం లేదని పి. కుమారి అనే మహిళ మూడో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కొవ్వూరు
•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

దళితుల సంక్షేమానికి శ్రద్ధ చూపాలి

కొవ్వూరు పట్టణం: ఉప ప్రణాళిక నిధులతో దళిత వాడలను అభివృద్ధి చేయాలని.. ప్రైవేటు రంగంలో రిజర్వేషను అమలు చేయాలని జగ్జీవన్‌రామ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పెనుమాక జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేయాలన్నారు. గత అయిదేళ్ల కాలంలో ఎస్సీ గురుకుల పాఠశాలలు ప్రారంభం కాలేదన్నారు. సంఘ కార్యదర్శి కె.దాసు, సీహెచ్ చంద్రరావు, ఎస్. పుల్లయ్య, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

28న పురపాలక సమావేశం

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు పురపాలక సంఘ సాధారణ సమావేశాన్ని ఈనెల 28న (శనివారం) నిర్వహిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు హాజరవ్వాలని కోరారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి చేయూత



దేవరపల్లి: దేవరపల్లిలోని ఇటీవల అనారోగ్యం కారణంగా మృతిచెందిన జనసేన కార్యకర్త లింగాల శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థికసాయాన్ని ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు బుధవారం అందించారు. దేవరపల్లి గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో రూ.20,000 నగదు, నాలుగు బస్తాల బియ్యం అందజేశారు. కంబాల సత్తిబాబు, చప్పటి శివ, కొండపల్లి రమేష్, మాధవరపు వెంకటేశ్వరరావు, బాలు, శ్రీనివాస్, మణికంఠ పాల్గొన్నారు.



గర్భిణులకు సారె అందిస్తున్న మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు

సంక్షేమం, అభివృద్ధే కూటమి లక్ష్యం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి జరుగుతుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఉండ్రాజవరం మండలంలోని సత్యవాడలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అందులో మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొని మాట్లాడారు. కూటమి 100 రోజుల పాలనలో పింఛను పెంచటంతో పాటు ఇచ్చిన హామీలన్నీ ప్రాధాన్యాల క్రమంలో పూర్తి చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొని గర్భిణులకు సారెలు ఇచ్చారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. విజయవాడలోని వరద బాధితుల కోసం సత్యవాడలో బాలజ్యోతి పాఠశాల ఆధ్వర్యంలో రూ.43 వేలు, మోర్త నవోదయ పాఠశాల ఆధ్వర్యంలో రూ.21 వేలు, సత్యవాడ డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో రూ.45 వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని మంత్రికి అందజేశారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, సర్పంచి ఇందుకూరి దేవీభార్గవి, ప్రసాదరాజు, తదితరులు, అధికారులు పాల్గొన్నారు.

అయిదేళ్లు పట్టించుకోక..
అడుగేయాలన్నా ఆలోచించాల్సిందే..

అన్నదాతలు తమ పంట ఉత్పత్తులను పుంత రహదారులపైనే మార్కెట్‌కు తరలిస్తుంటారు. పలు ప్రాంతాల్లో వాటిపై ధాన్యం ఆరబోసుకుంటారు. గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధుల ద్వారా వీటికి మరమ్మతులు చేసేవారు. గత వైకాపా హయాంలో ఎలాంటి పనులు జరగలేదు. ఆ దారులన్నీ గుంతలు పడి అధ్వానంగా మారాయి. వర్షం పడితే నడిచి వెళ్లడం కూడా గగనంగా మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో వీటిని అభివృద్ధి చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

పరిశీలన

నిధులు మంజూరైనా..



నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెం నుంచి చోడవరానికి వెళ్లే పొలిమేర పుంత రహదారి అధ్వానంగా ఉంది. ఈ మార్గం పరిధిలో 1,000 ఎకరాల్లో సాగు జరుగుతోంది. తెలికిచర్ల, అనంతపల్లి, ఈస్ట్, వెస్ట్ చోడవరం గ్రామాలకు చెందిన దాదాపు 800 మంది రైతులు దిగుబడులను ఈ మార్గం గుండా తరలిస్తారు. దారి అధ్వానంగా ఉండటంతో తరలించడం కష్టంగా ఉందని కర్షకులు వాపోతున్నారు. పుంత రోడ్డు మరమ్మతుల కోసం 2023లో మండల పరిషత్తు ద్వారా రూ.12లక్షలు మంజూరు చేశారు. ఇప్పటివరకు పనులు మాత్రం కార్యరూపం దాల్చలేదు.

చినుకు పడితే బురదే..



తాళ్లపూడి: వేగేశ్వరపురం అడ్డపుంత రహదారి, కుకునూరు నుంచి వేగేశ్వరపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. ఈ రెండు మార్గాల పరిధిలో ఆరు గ్రామాలకు చెందిన 1,000 మంది రైతులు ఉన్నారు. వీరు 3,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీటికి అయిదేళ్లుగా ఎలాంటి మరమ్మతులు చేయలేదు. చినుకుపడితే బురదమయంగా మారుతున్నాయి. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పుంతరహదారులు బాగుపడతాయని రైతులు ఎదురుచూస్తున్నారు. పుంతరహదారులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

ఆరేళ్లుగా నిర్వహణ లేదు..

ఉండ్రాజవరం: పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లోని ఎనిమిది గ్రామాలకు సంబంధించిన అజ్జరం పుంతరోడ్డు అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతాల్లో వరి, కొబ్బరి, కూరగాయల సాగు ఉంటుంది. అజ్జరం, వెంకటాపురం, తాడిపర్రు, తీపర్రు, వెలగదుర్రు, మోర్త, ఉండ్రాజవరం, పెరవలి గ్రామాలకు చెందిన దాదాపు 1,500 మంది 2,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దిగుబడి తరలించడానికి ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తారు. ఆరేళ్లుగా ఎలాంటి నిర్వహణ లేదు. పనులు చేసేందుకు సుమారు రూ. రెండు కోట్లు కావాలి.



వాహనం వెళ్లడం కష్టమే..

చాగల్లు: దారవరం పుంతమార్గంలో పొలం వరకు వాహనాలు వెళ్లడం కష్టం. వర్షం పడితే పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. సుమారు 100 మంది రైతులు 80 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. తెదేపా హయాంలో పనులు జరిగాయి. తర్వాత దెబ్బతిన్నా వైకాపా పాలకులు పట్టించుకోలేదు. ఈ రోడ్డును బాగు చేసేందుకు సుమారు రూ.12 లక్షలు అవసరమని ప్రాథమికంగా గుర్తించారు. ప్రతిపాదనలు పంపిచాల్సి ఉంది.



పట్టించుకోని పాలకులు..

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల నుంచి కురుకూరు వెళ్లే రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. ఈ రెండు గ్రామాల పరిధిలో దాదాపు 500 మంది రైతులు ఉన్నారు. వారంతా ఈ బాటనే ఉపయోగిస్తారు. ఆ పల్లె ప్రజలు మండల కేంద్రమైన దేవరపల్లికి రావాలన్నా ఇదే దారి. ఆ మార్గం దెబ్బతినడంతో ప్రయాణించడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. 2 కి.మీ. రోడ్డును బాగు చేయాలని అయిదేళ్లుగా కోరుతున్నా పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



'సీబీఐతో విచారణ చేయించాలి'

కొవ్వూరు పట్టణం: తిరుపతి లడ్డూ ప్రసాదంపై రాజకీయాలు మాని సీబీఐతో విచారణ జరిపించాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యామ్‌రవిప్రకాష్ బుధవారం డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం బాధాకరమన్నారు. హిందువులు రోడ్లపైకి రావాలని పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు.

గ్రామసభల నిర్వహణ

ఉండ్రాజవరం: మండలంలోని చివటం, సత్యవాడ, ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో స్వర్ణాంధ్ర గ్రామ సభలను పంచాయతీల వద్ద బుధవారం నిర్వహించారు. అభివృద్ధి పనులపై ప్రణాళిక తయారు చేశారు. సర్పంచులు, ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, ఈవో పీఆర్‌డీ ప్రసాదు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛత

నల్లజర్ల: స్వచ్ఛతా కార్యక్రమంలో అందరూ భాగస్వాములవ్వాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ తెలికిచెర్లశాఖ మేనేజర్ స్వామి పేర్కొన్నారు. బుధవారం ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణ శుభ్రం చేసి, మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల వితరణ

నల్లజర్ల: దూబచర్ల జిల్లా ఉన్నత పాఠశాలలో చదివే 130 మంది విద్యార్థులకు తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్సు డిపో పీఆర్వో విజయ్‌కుమార్ బుధవారం బస్‌పాస్‌లు అందజేశారు. ఆ మొత్తాన్ని రాజా జ్యూవెలర్స్ అధినేత గాదె వల్లయ్య రాజా సమకూర్చారు. సర్పంచి తాడిగడప బాలయ్య మాట్లాడుతూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయిని సుమతి, కె.ఉదయ్ భాస్కర్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుర్రపుడెక్క తొలగింపు

నిడదవోలు: పెండ్యాల కాలువ ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించే దిశగా జలవనరులశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నిడదవోలు మండలంతో పాటు, పెరవలి మండలం కానూరు అగ్రహారం, ఉసులుమర్రు తదితర గ్రామాల పరిధిలోని ప్రధాన కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్నారు. జలవనరులశాఖ నిడదవోలు ఏఈ పెద్దిరాజు పరిశీలిస్తున్నారు.

వీధి దీపాల ఏర్పాటు

ఉండ్రాజవరం: తాడిపర్రు పరిధిలో వెలగదుర్రు వరకు సర్పంచి కె.నరేంద్రబాబు ఆధ్వర్యంలో వీధి దీపాలు బిగించారు. తాడిపర్రు నుంచి ఉండ్రాజవరం వెళ్లే మార్గంలో కి.మీ. మేర ఏర్పాటుచేశారు. నిడదవోలు ఏఈ దొరబాబు పర్యవేక్షించారు.

స్పందనకు వందనం

గుంత పూడ్చారు..



నల్లజర్ల: ఆవపాడు శివారులోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో బీటీ రహదారి మధ్యలో గుంత ఏర్పడి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై బుధవారం 'ఈనాడు'లో 'పడుతూ..లేస్తూ' శీర్షికతో చిత్ర వార్త ప్రచురితమైంది. దీనిపై సర్పంచి అచ్యుత సత్యనారాయణ స్పందించారు. తన సొంత నిధులతో రహదారి మధ్యలోని గుంతలను పూడ్పించారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

నిడదవోలు: పట్టణంలోని విద్యానగర్‌లో గతంలో రద్దు చేసిన క్రీడా వికాస కేంద్ర పనులు తిరిగి చేపట్టేందుకు అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీవీ శేషగిరి తెలిపారు. 24న 'ఈనాడు'లో 'క్రీడా వికాసం సాధ్యమేనా..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. దీని నిర్మాణానికి శాప్ ద్వారా రూ.2కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ పనులు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా చేపట్టి 16 శాతం పూర్తి చేశారన్నారు. 25 శాతం లోపు జరగని పనుల్లో భాగంగా ఇది కూడా రద్దయ్యిందన్నారు. తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే పనులు చేపడతామన్నారు.

కల్వర్టు నిర్మించాలి..

సమస్య: మండల శివారు రెడ్డిచెరువులో కల్వర్టు శిథిలావస్థకు చేరింది. గోడలు కూలిపోయాయి. వాహనదారులు అదుపు తప్పి పడిపోయే ప్రమాదం ఉంది. కల్వర్టు నిర్మించాలి. - పి.రమేష్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి పునర్నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. - సీహెచ్ శ్రీనివాసు, ఏఈ

డ్రెయిన్లు శుభ్రం చేయాలి

సమస్య: అన్నవరపాడులోని ఎస్సీ ఏరియాలోని డ్రెయిన్లు శుభ్రం చేయాలి. వర్షాలకు అపరిశుభ్రంగా తయారయ్యాయి. - రామారావు, అన్నవరపాడు

సమాధానం: వెంటనే శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. - చంద్రం వెంకటరమణ, పంచాయతీ విస్తరణాధికారి

- న్యూస్‌టుడే ఉండ్రాజవరం, పెరవలి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఉండ్రాజవరం: నులిపురుగుల నివారణ మాత్రలను సత్యవాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వేశారు. వాటి ప్రయోజనం గురించి వివరించారు. మండల వైద్యాధికారి రాజనాల ప్రసాదు, ప్రధానోపాధ్యాయిని బి.సూర్యాకాంతం, కాట్రగడ్డ సుభాషిణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం: రైతులకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జగన్నాథపురంలో గోపాలపురం సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎరువుల కొనుగోలు కేంద్రాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు రూ.20లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. సంజీవపురం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, కరగపాడు, గంగోలు, రాజంపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారు. పౌష్టికాహార మహోత్సవాల్లో సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, తెదేపా నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం గ్రామాభివృద్ధి



కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, నాయకులు

చాగల్లు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికాయుతమైన గ్రామాభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నారని, ఆయన ఆశయాలను కార్యరూపం దాల్చేలా పనిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. చాగల్లు మండలంలోని దారవరం, నందిగంపాడు గ్రామాల్లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల నుంచి అందే రుణాలకు సంబంధించిన చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ, కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి టీవీ రామారావు, నాదెళ్ల శ్రీరామ్, బొడ్డు రాజు, సుంకర రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్మించి.. వదిలేసి..

నిడదవోలు పట్టణానికి చెందిన భవాని కూరగాయల మార్కెట్‌కు వెళ్లారు. నాలుగు రకాల కూరగాయలు అరకిలో చొప్పున కొనుగోలు చేశారు. ధర ఎంతని అడిగితే రూ.180 అయ్యిందని వ్యాపారి చెప్పడంతో ఆమె అవాకయ్యారు. ఇది ఆమె ఒక్కరి పరిస్థితే కాదు. పట్టణంలోని మధ్యతరగతి అందరిదీ.

నిడదవోలు, న్యూస్‌టుడే: రైతుల పంటలకు గిట్టుధర అందేలా, వినియోగదారుడికి తక్కువ ధరకు కూరగాయలు అందాలనే ఉద్దేశంతో తెదేపా ప్రభుత్వ హయాంలో రైతుబజార్లు ఏర్పాటు చేశారు. అందులో కొన్ని చోట్ల కొనసాగుతుండగా, అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని ప్రాంతాల్లో మూతపడ్డాయి. నిడదవోలు సంతమార్కెట్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు. అది కొంతకాలంగా బాగానే నడిచింది. అనంతరం రైతుల స్థానంలో వ్యాపారులు చేరడంతో ఆదరణ లేక మూతపడింది. పట్టణంలో సుమారు 43వేల మంది జనాభా ఉన్నారు. నిత్యం చుట్టుపక్కల 50 గ్రామాల నుంచి జనం వస్తుంటారు. గత తెదేపా పాలనలో పురపాలక సంఘం సంత మార్కెట్‌లో రైతుబజార్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో షెడ్డును ఏర్పాటు చేశారు. అందులో ప్రారంభించిన రైతుబజార్ మూణ్నాల ముచ్చటగానే మిగిలింది. అందులో బయటి వ్యక్తులు తమ సరకులు నిల్వ చేసుకుంటున్నారు.



నిడదవోలు రైతుబజారు

బజారు ఏర్పాటు చేయాలి..



ద్వితీయశ్రేణి పురపాలక సంఘమైన నిడదవోలులో కూటమి ప్రభుత్వంలో రైతుబజారు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. అది లేక బయటి మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. నిడదవోలులో గతంలో ఏర్పాటు చేసి తీసేశారు. మళ్లీ సంతమార్కెట్‌లో పెట్టారు. అక్కడ ఏర్పాటు చేసిన షెడ్డు నిరుపయోగంగా ఉంది.

- పుట్టా సుబ్బారావు, కాటకోటేశ్వరం

ఆర్యవైశ్య నూతన కార్యవర్గం ఏకగ్రీవం



కొవ్వూరు పట్టణం: కొవ్వూరు ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షునిగా మట్టే వీర వెంకట వరప్రసాద్, కార్యదర్శి కొల్లేపర శ్రీనివాస్, కోశాధికారిగా తుమ్మలపల్లి నాగరమేష్, వాసవి ట్రస్ట్ ఛైర్మన్‌గా కక్కిరాల సోమయ్య ఎన్నికయ్యారు. ఈనెల 24న జరిగిన సర్వసభ్య సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం వాసవి కల్యాణ కల్యాణ మండపంలో అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఆదర్శంగా నిలుస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని నాయకులు సత్యవరపు గోపాలకృష్ణ, మద్దుల నాని, మద్దుల సత్యనారాయణ, ఎంబీఎస్ ప్రసాద్, నాళం శ్రీనివాస్, కక్కిరాల సూరిబాబు తదితరులు అభినందించారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

తాళ్లపూడి, నల్లజర్ల, ఉండ్రాజవరం, చాగల్లు: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో రుచిత సూచించారు. తాళ్లపూడి, కుకునూరు పరిధిలో బుధవారం నిర్వహించారు. ఏవో రుచిత మాట్లాడుతూ పంటల్లో ఆశించే చీడపీడల నివారణకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, పశువైద్యాధికారి బాలాజీ, భీష్మాంబ తదితరులు పాల్గొన్నారు. నల్లజర్ల మండలంలోని పుల్లలపాడు, అయ్యవరంల్లో నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.కరుణశ్రీ, చిరంజీవి రైతులకు ఆయిల్‌పాం, నిమ్మ, వరి సాగులో సస్యరక్షణ చర్యలు వివరించారు. ఏవో కమల్‌రాజ్ వివరించారు. మండల ఉద్యానశాఖాధికారిణి బబిత తదితరులు పాల్గొన్నారు. ఉండ్రాజవరంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి మాట్లాడారు. పాలంగిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో ఎం.విశ్వాసరావు, సర్పంచి బొక్కా శ్రీనివాసు, రైతులు పాల్గొన్నారు. చాగల్లు మండలంలోని మార్కొండపాడు, దారవరంల్లో ఏవో కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.



సూచనలు చేస్తున్న ఏవో రుచిత

అంత్యోదయ స్ఫూర్తిప్రదాత

కొవ్వూరు పట్టణం: ఆర్థిక, సాంఘిక రంగాల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలన్న దీన్‌దయాళ్ గొప్ప వ్యక్తి అని భాజపా నాయకులు అన్నారు. భాజపా ఆధ్వర్యంలో జన్‌సంఘ్ నేత పండిట్ దీన్‌దయాళ్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎం.రామచంద్రరావు, పెరుగు పోతురాజు, బీవీ ముత్యాలరావు, టి.విజయలక్ష్మి, ఎం.ఆంజనేయులు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక

ఉండ్రాజవరం: వేలివెన్ను విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైనట్లు శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిడదవోలులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటారన్నారు. అండర్-17 బాలుర విభాగంలో వాలీబాల్‌లో పి.కార్తికేయ, కబడ్డీలో టి.వైష్ణవ్‌తేజ్, ఎస్.శ్రీరామ్, యోగాలో కె.జశ్వంత్‌శ్రీరామ్ చదరంగంలో సీహెచ్ హరినాథ్, ఖోఖోలో యు.సుశాంత్, ఎస్.తారకేష్, షటిల్ బ్యాడ్మింటన్‌లో జి.తనీష్, షార్ట్‌పుట్‌లో పి.గణేష్, 100 మీటర్ల పరుగు పందెంలో కె.సాయిమహేష్ ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో కబడ్డీలో ఎస్.సత్యశ్రీ, యోగాలో బి.రుషిత, ఎం.స్రవంతి, డి.మణితేజశ్రీ, ఖోఖోలో ఎ.కమల, బి.రేవతి, 400 మీటర్ల పరుగులో కె.భార్గవి, డిస్కస్‌త్రోలో కె.వైష్ణవిదుర్గ, ఎం.మౌనిక, షాట్‌పుట్‌లో కె.వైష్ణవిదుర్గ సత్తా చాటారన్నారు. అండర్ 14 బాలుర విభాగంలో యోగాలో కె.జశ్వంత్, బి.తేజసాయిరామ్, ఖోఖోలో ఆర్.జయరామ్, కె.భార్గవశివసాయి, టి.చైతన్య, పి.మణిశేషాద్రినాయుడు, ఎల్.నవదీప్, 100, 200 మీటర్ల పరుగు పందెంలో ఆర్.జయరామ్, బాలికల విభాగంలో ఖోఖోలో లక్షిత, 100 మీటర్ల పరుగులో జి.ప్రియవర్షిణి ఎంపికయ్యారన్నారు. విజేతలను, వ్యాయామోపాధ్యాయులను రవికుమార్‌తో పాటు విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ, ప్రిన్సిపల్ షేక్ షానూర్ అభినందించారు.



ముగిసిన సెపక్‌తక్రా ఎంపికలు

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి సెపక్‌తక్రా ఎంపిక పోటీలు బుధవారంతో ముగిశాయి. ఎంపిక పోటీలకు సుమారు 150 మంది విద్యార్థులు హాజరు కాగా ఆయా పాఠశాలల అండర్-14 బాలబాలికలు ఎం.జెస్సీశ్రీ, కే.వర్షిణి, టి.గీతామాధురి, టి.అఖిల, పి.ఆశ్రీత, టి.ప్రశాంతి, జె.అభిరామ్, ఇ.వివేక్, కె.అభిలాష్, వి.హర్షవర్ధన్, జె.ప్రకాష్, అండర్-17కు జి.సతీష్, వి.ప్రవీణ్, ఎం.సతీష్, కె. అభిషేక్, ఎం.అఖిల్, వై.ఆంటోని, బి.గీతిక, పి.దుర్గామధుర శ్రీ, ఎం.మహాలక్ష్మి, బి.వెన్నెల, పి.బాల భవ్యశ్రీ, ఎం లాస్య తదితరులు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తరపున పాల్గొంటారన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెరవలి: మండలంలోని ఖండవల్లి జిల్లాపరిషత్తు హైస్కూల్ విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనెల 26న చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి సందర్భంగా ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయిని కండిబోయిన ఉమ తెలిపారు. 8, 9, 10వ తరగతి పిల్లలు హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పోలవరపు రామాంజనేయులు పాల్గొన్నారు.

బాబోయ్ పశువులు..

ఓ వ్యక్తి నిడదవోలు ఆర్వోబీ నుంచి గణేష్‌చౌక్ వైపు వెళ్తుండగా పశువులు అడ్డు రావడంతో కిందపడి గాయాల పాలయ్యారు. ఇలాంటి ఘటనలు పట్టణంలో తరచూ చోటు చేసుకుంటున్నాయి. రహదారులపై పశువులు మందలుగా తిరుగుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రాత్రి పూట రోడ్డుపైనే కూర్చుంటున్నాయి. చీకట్లో కనిపించక పలువురు సడన్ బ్రేకులు వేసి పడిపోతున్నారు. పురపాలక అధికారుల నిర్లక్ష్యంతో సమస్య తీవ్రత పెరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించాలని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, నిడదవోలు

ముసిరేసిన తుప్పలు

పెరవలి మండలం ముక్కామలలోని కాలువకు వెళ్లే మార్గంలో ఇరువైపులా తుప్పలు విపరీతంగా పెరిగాయి. మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ముక్కామల వంతెన నుంచి లంకల్లోకి పచ్చగడ్డి కోసేందుకు రైతులు వెళ్తుంటారు. వంతెన దిగి మలుపు వద్దకు వచ్చేసరికి అటుగా వెళ్లే వాహనాలు కనిపించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో భాగంగా వీటిని తొలగించాలని కోరుతున్నారు. దీనిపై ఉపాధిహామీ అధికారి శ్రీనివాసును వివరణ కోరగా వెంటనే తుప్పలు తొలగిస్తామన్నారు.



- న్యూస్‌టుడే, పెరవలి

సంచి సరిపోతుందా..!

నిడదవోలు మండలం డి.ముప్పవరం నుంచి గోపవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి ఇది. దీనిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతటి ప్రధాన రహదారిలో పురుషోత్తపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద రహదారి మధ్యలో గుండ్రని ఆకారంలో రంధ్రం ఏర్పడింది. అది కనిపించక వాహనదారులు అందులో పడి గాయాల పాలవుతున్నారు. ప్రమాదాలు జరగకుండా స్థానికులు కర్రకు సంచి ఏర్పాటు చేశారు. రాత్రిపూట ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులకు విన్నవించినా పట్టించుకోవట్లేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా దీనికి పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, నిడదవోలు